## బిజెపితోనే అభివృద్ధి : అందె బాబయ్య



**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 27) :** భారతీయ జనతా పార్టీతోనే పట్టణాలు అభివృద్ధి చెందుతా యని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య తెలిపారు. ఆదివారం సాయంత్రం షాద్‌నగర్ పట్టణం లోని మెయిన్ రోడ్డులో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు చెంది మహేందర్ రెడ్డి, వెంకటేష్ గుప్త, వసంతరావు, కాసోజు శివ, తదితరులు హాజరయ్యారు. మెయిన్ రోడ్డులో బీజేపీ సభ్యత్వం తీసుకోవడానికి ప్రజలు చాలా ఆసక్తి చూపారని పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వం కావాలని అడుగుతున్నారని పేర్కొన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రధానమంత్రి మోదీ ఆవశ్యకత ఎంతో ఉందని పేర్కొన్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

# వార్త

## అమరవీరుల వారోత్సవాల్లో భారీ ర్యాలీ



**ఘట్‌కేసర్, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అధికా రుల త్యాగాలు వెలకట్టలేనివని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పి.పరశురాం అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం పోలీసులు, కళాశాల విద్యార్థులు బ్యానరు ప్రదర్శించి ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ జరిపారు. ఈసందర్భంగా పోలీసు అమర వీరులకు సీఐ పరశురాం, డిఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు ప్రభాకర్‌రెడ్డి, నర్సింహ్మా, శ్రీకాంత్, శేఖర్, సిబ్బంది నివాళులు అర్పించి వారి త్యాగాలను కొనియాడారు.



బాధిత గిరిజనులతో మాట్లాడుతున్న గిరిజన నేత రాంబల్ నాయక్

## గిరిజనుల భూములు లాక్కుంటే ఊరుకోం

### ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాంబల్ నాయక్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 27) :** ఇందిరమ్మ బిడ్డలుగా పిలవబడుతున్న గిరిజన ప్రజల భూములను లాక్కొని ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయడం అన్యాయమని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, షాద్‌నగర్ సీనియర్ గిరిజన నేత ఎం. రాంబల్ నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో నిర్మించ తలపెట్టిన ఫార్మా కంపెనీని ఎల్‌హెచ్‌పీఎస్ అడ్డుకోబోతుందని ప్రకటించారు. ఈ సందర్భంగా కొడంగల్ నియోజకవర్గంలోని రోటిబండ తండాకు ఎల్‌హెచ్‌పీఎస్ ప్రతినిధుల బృందం సందర్శించి అనేక విషయాలను సేకరించిందని రాంబల్ నాయక్ తెలిపారు. పులిచెర్ల తండా, ఈదులకుంట తండా, లకచర్ల, హకీంపేట, పోలేపల్లి, ఈర్లపల్లి గ్రామాల ప్రజలు ఫార్మా కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేఖంగా పోరాటం చేస్తున్నారని, ఇందులో తమ గిరిజన బిడ్డల అవస్థ వర్ణనాతీతమని మీడియాకు తెలిపారు. గిరిజనుల భూములను గుంజుకుంటే ఎల్‌హెచ్‌పీఎస్ చూస్తూ ఊరుకోదని, ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో ఫార్మా కంపెనీని పెట్టనిచ్చేది లేదన్నారు. గిరిజనులను ఫార్మా కంపెనీ పేరుతో గ్రామాల నుండి వెళ్లగొట్టే కుట్ర జరుగుతుందని అనుమానం వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్, రోడ్ల అభివృద్ధి, పరిశ్రమల అభివృద్ధి పేరిట గిరిజనుల భూములను లాక్కోవడం ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రాంబల్‌నాయక్ హెచ్చరించారు. తనవెంట ఉన్న ప్రతినిధుల బృందంలో రాజు నాయక్, గోపాల్ నాయక్, సేవ్యా నాయక్, విజయ్ నాయక్, లక్ష్మణ్ నాయక్, పాండు నాయక్, మోహన్ నాయక్, రాము నాయక్, తదితరులు ఉన్నారు.

# షాద్‌నగర్‌లో డిటోనేటర్ల పేలుడు

**కంపించిన బాలాజీ టౌన్‌షిప్ కాలనీ**
**ఇళ్ల నుండి బయటికి వచ్చిన జనాలు**
**డిటోనేటర్లు పేల్చి మా ప్రాణాలు తీయొద్దు**
**స్థానికుల ఆందోళన - పోలీసులకు ఫిర్యాదు**

**షాద్‌నగర్, అక్టోబరు 27, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ శివారులోని చౌడమ్మగుట్టపై జరుగుతున్న పేలుళ్ల కారణంగా ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గుట్ట సమీపంలో ఓ వెంచర్ నిర్వాహకులు ఆదివారం డిటోనేటర్లను పేల్చడంతో పెద్ద ఎత్తున అలజడి చెలరేగింది. పేలుళ్ల ధాటికి ఇళ్లు కంపించడంతో ప్రజలు బయటికి పరుగులు తీశారు. ఈ సంఘటనతో స్థానికులు ఆగ్రహానికి గురయ్యారు. వెంటనే షాద్‌నగర్ పోలీసులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయడంతో స్థానిక ఎస్‌ఐ బలరాం, తదితర సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డితో పాటు స్థానికులు రాజిరెడ్డి, సంతోష్, శివ, శంకర్, శ్రీనాథ్, తదితరులు పోలీసుకులతో కలిసి చౌడమ్మగుట్టపై పేలుళ్లు జరిగిన ప్రదేశానికి మీడియాతో కలిసి చేరుకున్నారు. గుట్టపై డిటోనేటర్లు అమర్చిన ఆనవాళ్లు కనిపించాయి. రాళ్లకు రంధ్రాలు వేసి అందులో డిటోనేటర్ అమర్చి వాటిని పేల్చకుండా అలాగే వెళ్లిపోయిన వాటిని స్థానికులు పోలీసులు, మీడియాకు చూపించారు. అస్తమా



షాద్‌నగర్ ఎస్‌ఐ బలరాంతో పేలుళ్ల గురించి వివరిస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి

నం వెంచర్ నిర్మాణం కోసం గుట్టను డిటోనేటర్లతో పేల్చుతున్నారని, ఈ శబ్దంతో ఇళ్లలో ఉన్నవారు తీవ్ర భయాందోలనకు గురవుతున్నామని స్థానికులు పోలీసుల దృష్టికి తెచ్చారు. గతంలో ఈ పేలుళ్లపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కొంత కాలం ఈ పేలుళ్లను నిలిపివేసినట్లు స్థానికులు తెలిపారు. ఇటీవల మళ్లీ భారీ ఎత్తున డిటోనేటర్ల పేలుళ్లు జరపడం ఏమిటని పోలీసులకు స్థానికులు ప్రశ్నించారు.

### చాలా పెద్ద పేలుడు : డీసీపీకి ఫోన్‌లో పీవీఆర్

చౌడమ్మగుట్టపై ఆదివారం భారీ ఎత్తున పేలుడు జరిగిందని, దీంతో బాలాజీ టౌన్‌షిప్ కాలనీలో భీకర శబ్దం వచ్చిందని, ఇండ్లు కంపించాయని స్థానిక బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి శంషాబాద్ డీసీపీ రాజేష్‌కు ఫోన్ ద్వారా సంఘటనా స్థలం నుండి ఫిర్యాదు చేశారు. రిక్టర్ స్కేలుపై పేలుడు తీవ్రత 4.5 నుండి 5 వరకు ఉంటుందని ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో చాలా పెద్ద శబ్దం వచ్చిందని, ఈ పేలుడు ధాటికి తన భార్య రమాదేవి భయభ్రాంతులకు గురైందని, అదేవిధంగా స్థానికులు ఎంతోమంది ఇళ్ల నుండి బయటికి వచ్చేశారని, అడుగడుగునా ప్రాణభయంతో ప్రజలు భీతిల్లుతున్నారని విష్ణువర్ధన్ రెడ్డి డీసీపీ దృష్టికి తెచ్చారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని తమ ఆందోళనను అర్థం చేసుకొని వెంటనే బ్లాస్టింగులను నిలిపివేయాలని పోలీసు శాఖ ద్వారా కోరారు. నిర్వాహకులు పేలుళ్లను నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నారని, పెద్ద గుట్టలను తొలిచే క్రమంలో భారీ ఎత్తున డిటోనేటర్లను అమర్చుతున్నారని, ఆ పేలుడు ధాటికి భూమి కంపిస్తుందని పేర్కొన్నారు.



డిటోనేటర్ల పేలుడుకు ధ్వంసమైన రాళ్లు

### ఇళ్లు కంపిస్తున్నాయి

బాలాజీ టౌన్‌షిప్‌లో నివాసముంటున్న ప్రజలు రమాదేవి, శివ, శంకరయ్య, శ్రీనాథ్, రాజిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, సంతోష్, తదితరులు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పేలుళ్ల ధాటికి తమ ఇండ్లు కంపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేలుళ్ల శబ్దం ధాటికి చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు అనారోగ్యానికి గురవుతున్నారని, మానసిక వేదన అనుభవిస్తున్నారని ఆవేదన చెందారు. ఇండ్లు కూడా పగుళ్లకు గురవుతున్నాయని, మరికొన్ని రోజులైతే ఇండ్లు కూడా కూలిపోయే ప్రమాదం ఉందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మధ్య కాలంలో పెద్దఎత్తున పేలుళ్ల శబ్దాలు వినిపిస్తున్నాయని, ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, అసలు అధికారులు ఉన్నారా లేరా.. ఇంత జరుగుతున్నా పట్టించుకోరా అని అసంతృప్తి వ్యక్తం చేశారు. బాలీజీ టౌన్‌షిప్ వాసులకు వేరే చోట ఇండ్లు కట్టించి పంపించాలని, అప్పుడు యదేచ్ఛగా పేలుళ్లు చేసుకోవాలని విరక్తి చెందారు. స్థానిక ఎస్‌ఐ బలరాం తదితరులు నిర్వాహకులను పిలిచి మాట్లాడారు. బ్లాస్టింగ్‌లు ఎలాంటి హెచ్చరికలు లేకుండా చేపట్టకూడదని హెచ్చరించారు. నిబంధనలు పాటించాలని స్థానికులు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.



రాయిలో డిటోనేటర్‌ను అమర్చి వెళ్లిపోయిన నిర్వాహకులు

## కళాశాల భవన నిర్మాణ పనుల పరిశీలన



పునాది పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 27) :** షాద్‌నగర్ పట్టణంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం పరిశీలించారు. ఇటీవలే ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్యేలు బక్కని నర్సింహులు, బీష్వ కిష్టయ్య, ప్రతాప్‌రెడ్డి తదితరులతో కలిసి శంకుస్థాపన చేసిన విషయం విధితమే. తొందరగా పనులు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నాటిని భవనం విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. ఎంతో కాలంగా సరైన భవనం లేక నియోజకవర్గ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాతల సహకారంతో నూతన కళాశాల నిర్మాణం తప్పకుండా పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవనాన్ని నాణ్యతగా నిర్మించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెంది తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, రఘు, ఇద్రీస్, బాల్‌రాజ్ గౌడ్, ముబారక్, అగ్గనూరు బస్వం, మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ, మహ్మద్ ఇబ్రహీం, కుమార్, అన్వర్, కౌన్సిలర్ సర్వర్ పాష, సయ్యద్ ఖదీర్, లింగారెడ్డి గూడెం అశోక్, సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినిపై లెక్చరర్ అసభ్య ప్రవర్తన

### కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**పెద్దేముల్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓ ఇంటర్ విద్యార్థినిపై ఓ లెక్చరర్ అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కళాశాల విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం..కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థినిపై ఓ లెక్చరర్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని తెలిసింది. ఇటీవల కళాశాలకు వచ్చిన విద్యార్థి సంఘం నాయకులకు ఆమే విషయం వివరించింది. వారు గ్రామస్థులతో కలిసి కళాశాలకు వెళ్ళి అధ్యాపకుడిని నిలదీశారు. వారందరు కలిసి ఆ లెక్చరర్‌ను నిలదీయడంతో తప్పైందని వారి ముందు ఒప్పుకున్నట్లు తెలిసింది. మరో మారు తప్పుచేయనని తమను క్షమించాలని వేడుకున్నట్లు తెలిసింది. విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన లెక్చరర్‌పైకఠినంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు, గ్రామ స్థులు డిమాండ్ చేశారు. ఇట్టి విషయమై ప్రిన్సిపాల్ నర్సిములును వివరణ కోరగా ఆయన అందుబాటులోకి రాలేదు.

## నేడు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు భూమిపూజ

**కొడంగల్,అక్టోబర్ 27ప్రభాతవార్త**

కొడంగల్ పట్టణంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు సోమవారం భూమిపూజ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సోమవారం ఉదయం 11గంటలకు పట్టణంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ భూమిపూజా కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి హాజరుకానున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

## అర్హులకే డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలి

### బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మఠం ఋషికేష్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 27) :** తెలంగాణ ప్రభుత్వం అర్హులైన వారికే డబుల్ బెడ్‌లను కేటాయించాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మఠం ఋషికేష్ అన్నారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ, భారీ వర్షాలకు ఇండ్లు కోల్పోయి నిర్వాసితులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్‌లు దక్కే విధంగా చూడాలని ఆయన స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా, నిష్పక్షపాతంగా రాజకీయాలకు అతీతంగా డబుల్ బెడ్ రూమ్‌లను అందించాలని, ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు ప్రతిపక్ష పార్టీల నాయకులను కూడా భాగస్వామ్యం చేయాలని పేర్కొన్నారు.

# అవినీతి, అక్రమాలకు కేరాఫ్ మున్సిపల్ కార్యాలయం





ఘట్‌కేసర్ పురపాలక సంఘం కార్యాలయం

**ఎసిబి దాడి..అధికారుల్లో గుబులు**
**బిల్లుల మంజూరు, నిర్మాణాలకు వసూళ్లు**
**లంచాలు ప్రోత్సహిస్తున్న కాంట్రాక్టర్లు**

**ఘట్‌కేసర్, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయం అవినీతి, అక్రమాలకు నిలయంగా మారింది. అధికారులు, సిబ్బంది లంఛాలకు అలవాటుపడి అక్రమార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారని విమర్శలు గుప్పుమంటున్నాయి. బిల్‌కలెక్టర్ నుంచి కమీషనర్ స్థాయి వరకు అవినీతికి పాల్పడుతుండటంతో అక్రమాలకు కేరాఫ్‌గా మున్సిపల్ తయారైంది. వినాయక నిమజ్జనం క్రేన్ల బిల్లు మంజూరు చేసేందుకు ఓకాంట్రాక్టర్ నుంచి ఇంచార్జ్ మున్సిపల్ ఏఈ రాజశేఖర్ రూ.50 వేలు లంఛం తీసుకొని ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈవ్యవహారంలో ఎంబీ ప్రక్రియ పూర్తి చేయడానికి వర్క్ఇన్‌స్పెక్టర్ (ఔట్‌సోర్సింగ్) సన్నీ రూ.30 వేలులంఛం తీసుకున్నాడు. ఇద్దరిని కూడా ఏసీబీ అరెస్ట్ చేసి నాంపల్లిలోని ఏసీబీ కోర్టుకు రిమాండ్ చేసింది. మున్సిపల్ కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగంలో లంఛాలు ఇవ్వనిదే బిల్లులు మంజూరు కావడం లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. వినాయక నిమజ్జన క్రేన్ల బిల్లు మంజూరు విషయంలో ఏఈ, వర్క్ఇన్‌స్పెక్టర్లు కాంట్రాక్టర్‌ను ఇబ్బందులకు గురి చేస్తూ ఎంబీ చేయకుండా జాప్యం చేస్తుండంతోను బాధిత కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించినట్లు తెలుస్తోంది. అధికారులు, సిబ్బంది అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ ప్రజలకు సక్రమంగా సేవలు అందించకుండా డబ్బులు వసూలు చేసే పనులు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని స్థానికులు అంటున్నారు. విధినిర్వహణలో భాగంగా సకాలంలో చేయాల్సిన పనులను పెండింగ్‌లో పెట్టి డబ్బులు ఇస్తేనే బిల్లులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి కోట్లాదిరుపాయాల బిల్లుల ను వర్క్ఇన్‌స్పెక్టర్, ఏఈ, కమీషనర్ల ద్వారా విడుదల చేయాల్సి ఉండగా కమీషన్ల పేరుతో అధికారులు వేధిస్తున్నారని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. గతంలో బిల్‌కలెక్టర్ హేమంత్‌కుమార్ రూ.3.13 కోట్ల రుపాయలు ఇంటిపన్నుల డబ్బులను ఖాతాలో జమచేయకుండా సొంతానికి వాడుకొని అక్రమాలు చేయడంతో అప్పటి కమీషనర్, మేనేజర్‌లపై సీడీఎంఏ చర్యలు తీసుకుంది. బిల్‌కలెక్టర్ డబ్బులను దుర్వినియోగం చేయడంలో పైఅధికారులు పనితీరుపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. పట్టణప్లానింగ్ విభాగం సిబ్బంది, బిల్‌కలెక్టర్లు భవన నిర్మాణదారుల నుంచి పెద్ద మొత్తాలో ముడుపులు పుచ్చుకొని అందిన కాడికి దోచుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో బిల్‌కల్కెక్టర్లు ఇంటి నిర్మాణదారులకు నకిలి రశీదులు ఇచ్చి వసూలు చేసిన డబ్బులను సొంతానికి వాడుకున్న బాగోతాలు ఇక్కడ జరిగాయి. ఉన్నత స్థాయి అధికారుల ద్వారా పరిపాలనా పరమైన అజమాయిషీ లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా భవన నిర్మాణదారుల నుంచి అధికారులకు లంఛాలు ఇప్పిస్తూ తమ వాటా పొందుదున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి చోట లంఛగొం డితనం పెరిగిపోవడంతో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా అవినీతిమయంగా మారుతున్నది. అవినీతి, అక్రమాలకు నిలయంగా మారిన ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయంలో ఇకనైనా లంఛగొండితనం నిర్మూలనకు ఉన్నత స్థాయి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మహేందర్‌రెడ్డిని కలిసిన ఉర్దూ మీడియం నిరుద్యోగ ఉపాధ్యాయ సంఘం

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం సహకరించాలని, సీఎం రేవంత్‌రెడ్డికి తమ సమస్యను వివరించి ప్రత్యేక డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని కోరుతూ.. ఉర్దూ మీడియం నిరుద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆదివారం ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. తాండూరులో ఓ కార్యక్రమంలో పాల్గొన్న మహేందర్‌రెడ్డి అనంతరం క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. మహేందర్‌రెడ్డి రాకను తెలుసుకున్న శిక్షణ పొందిన నిరుద్యోగ ఉర్దూ మీడియం ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఖాజా పాషా, అబ్దుల్ నాసర్, అబ్రహాం, రేహాన్, అస్లం తదితరులు మహేందర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేసేందుకు సహకరించాలని తెలంగాణ రాష్ట్ర ఉర్దూ మీడియం శిక్షణ పొందిన నిరుద్యోగ ఉపాధ్యాయ సంఘం అభ్యర్థించింది. శిక్షణ పొందిన ఉర్దూ మీడియం నిరుద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకులు రాష్ట్రంలో 666 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కాకుండా గత 20 ఏళ్లుగా ఉన్నాయని వివరించారు. గతంలో సీఎంగా ఉన్నప్పుడు కెసిఆర్ నిర్లక్ష్యం వహించారని, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఉర్దూ మీడియం పాఠశాలలు మూతపడకుండా చూస్తానన్న



ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఉర్దూమీడియం నిరుద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకులు

నేపథ్యంలో ఈ పోస్టులను ప్రత్యేక డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని వారు కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ తదితర కోటాలో మిగిలిపోయిన ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టులను ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి మెరిట్ విధానం ద్వారా భర్తీ చేయాలని అందుకు సీఎంతో చర్చించాలని మహేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. స్పందించిన మహేందర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి నిరుద్యోగుల సమస్యలను వివరిస్తానని, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి తో శిక్షణ పొందిన నిరుద్యోగ ఉర్దూ మీడియం అధ్యాపక అభ్యర్థులను భేటీ చేయించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఉర్దూ మీడియం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని మహేందర్ రెడ్డి తెలిపారు.

## కార్యకర్తలకు ఎల్లప్పుడూ టిడిపి అండ : నర్సింహులు

**ఘట్‌కేసర్, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** కార్యకర్తలకు తెలుగుదేశంపార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలంగాణ తెలుగుదేశంపార్టీ మాజీ అధ్యక్షులు-పోలిట్‌బ్యూరోసభ్యులు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బకి ్కని నర్సింహులు అన్నారు. ఘట్‌కేసర్ మండల టిడిపి మాజీ అధ్యక్షులు-ఘణాపూర్ మాజీ సర్పంచ్ వేముల సంజీవగౌడ్ సతీమణి రాజమణి అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆదివారం ఆయన వచ్చి పరామర్శించారు. టిడిపి జాతీయ అధ్యక్షులు-ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నర్సింహులు ఘణాపూర్‌లోని సంజీవగౌడ్ ఇంటికి చేరుకొని రాజమణి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని, ఆమె అనారోగ్య సమస్యపై పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు తెలియజేస్తామని తెలిపారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ మాజీ అధ్యక్షులు కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ సుంకరి వెంకటేశ్, నాగారం మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు కొండా జంగారెడ్డి, దమ్మాయిగూడ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు కృష్ణారావు, కోటేశ్వరరావు, మండల నాయకులు సామల జగన్మోహన్‌రెడ్డి, టి.మహేశ్, పి.సురేందర్‌రెడ్డి, జి.చంద్రయ్య, ఎండి.యాసిన్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

## విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలో ఎంపి ఈటల



విగ్రహాల ప్రతిష్ఠా పూజాలో పాల్గొన్న ఎంపి ఈటల రాజేందర్, పాల్గొన్న జిల్లా బిజెపి అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుమలరెడ్డి, నాయకులు ఎస్.మల్లారెడ్డి, ఏ.సుదర్శన్‌రెడ్డి, చైర్మన్ చంద్రారెడ్డి

**కీసర (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), అక్టోబరు 27, ప్రభాతవార్త**

చీర్యాల గ్రామంలోని రామాలయం పుననిర్మాణంలో భాగంగ జరిగిన విఘ్నేశ్వర, నవగ్రహాల విగ్రహాలు, ధ్వజస్థంభం ప్రతిష్టాపన పూజా కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఆదివారం మేడ్చల్ జిల్లా కీసర మండలం చీర్యాల గ్రామంలో రామాలయం పుననిర్మాణంలో భాగంగ విఘ్నేశ్వర, నవగ్రహాల విగ్రహాలు, ధ్వజస్థంభం ప్రతిష్ఠా పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగ మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ పాల్గొని పూజలు చేశారు. ఆ తరువాత జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమలరెడ్డి,పలువురు నాయకులు ఎంపి ఈటల రాజేందర్‌ను, జిల్లా బిజెపి అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డిని, బిజెపి సీనియర్ నాయకులు ఎస్.మల్లారెడ్డిని, ఏనుగు సుదర్శన్‌రెడ్డిని, మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డిని, పలువురు నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎస్.మల్లారెడ్డి, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమలరెడ్డి, నాగారం చైర్మన్ చంద్రారెడ్డి, మండల బిజెపి అధ్యక్షులు దేశం మల్లేశ్‌గౌడ్, నాయకులు కోల అశోక్‌యాదవ్, చిందం నాగేశ్, శ్రీని వాస రావు, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, ఏలూరి సత్యనారాయణ, కోల బాలరాజ్‌యాదవ్, పొట్ట అంజనేయులు, డొంకని రమేశ్‌గౌడ్, బర్లపాటి అంజనేయులు, కోల మల్లేశ్‌యా దవ్, యాంజాల రామకృష్ణగౌడ్, గూడురు నవీన్‌రెడ్డి, రామిడి ప్రభాకర్‌రెడ్డి, బర్లపా టి మహేశ్, పలువురు బిజెపి నాయకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉనికిని కాపాడుకునేందుకు మాజీ ఎమ్మెల్యే ప్రయత్నం

### కాంగ్రెస్ నాయకులు బిఆర్‌ఎస్‌లో చేరింది అవాస్తవం



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**కొడంగల్,అక్టోబర్ 27ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా మారిన కొడంగల్ నియోజకవర్గంలో కేవలం ఉనికిని కాపాడుకునేందుకు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నందారం ప్రశాంత్,మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు.ఆదివారం వారు కొడంగల్ పట్టణంలోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు.శనివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరింది కేవలం ఆ పార్టీ నాయకులే తప్ప కాంగ్రెస్ పార్టీ నాయకులు కాదని స్పష్టం చేశారు.గతంలో టీడీపీ పార్టీ నుంచి ఎంపీపీగా గెలిచిన దయాకర్‌రెడ్డి 2017లోనే బీఆర్‌ఎస్ పార్టీలో చేరారని,అంతేగాక ఇటీవలే బీఎస్పీ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా కొడంగల్ నుంచి పోటీ చేసిన నర్మద కిష్టప్ప ఇదివరకే బీఆర్‌ఎస్ పార్టీలో చేరారని గుర్తు చేశారు.అసలు కొడంగల్‌లో ఎవ్వరు తమ పార్టీలో ఉన్నారో ఎవ్వరు ఇతర పార్టీల్లో ఉన్నారో కూడ తెలియని అమాయకుడు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు.మాజీ ఎంపీపీని కొడంగల్ మండల ప్రజలే గుర్తించరని,ఎలాంటి ప్రజా సేవ చేయని ఆయన తన స్వగ్రామంలో కనీసం వార్డు సభ్యుడిగా కూడ గెలిచే సత్తా లేదని విమర్శించారు.సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుండడంతో ఎక్కడ తమ ఉనికి కోల్పోతామోనన్న భయాందోళనతోనే మాజీ ఎమ్మెల్యే పట్నం చేరికలు కొత్త డ్రామా మొదలు పెట్టారని విమర్శించారు.బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్న వారు ఏ పార్టీ నాయకులో తెలుసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పట్నం తెలుసుకోవాలని హితవు చెప్పారు.సమావేశంలో మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి,జీడి మల్లేశం,సూరి బానకారి నర్సిములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిరికొండ మధుసూదనాచారి

## భాషా సాహిత్యాలలో ప్రతిభాశాలి దివాకర్ల వెంకటావధాని

**శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి**

**చిక్కడపల్లి, అక్టోబరు 27 (ప్రభాతవార్త):** భిన్న భాషా సాహిత్యాలలో ప్రతిభాశాలి దివాకర్ల వెంకటావధాని అని రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఆదివారం ఎందరోమహానుభావులు మధురస్మృతులు కార్యక్రమంలో భాగంగా త్యాగరాయ గానసభ నిర్వహణ లో అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన దివాకర్ల వెంకటావధాని సంస్మరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మధుసూదనాచారి మాట్లాడుతూ దివాకర్ల సాహిత్య పరిశోధకుడు, విమర్శకుడు అని, పలు సాహితీ వ్యాసకర్త అని అన్నారు. కీలక ప్రసంగం చేసిన ప్రముఖ సాహితీవిమర్శకులు రమణ వెలమకన్ని మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతిగా తెలుగు భాషాభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్నారు. ఆయన శిష్యరికంలో ఎందరో ప్రముఖులుగా గుర్తింపు పొందారని, అందులో వారిలో డాక్టర్ సి.నారాయణరెడ్డి వంటివారున్నారన్నారు. కార్యక్రమంలో గాయకులు శ్రీధర రామసుబ్రహ్మణ్యం, గానసభ పాలకమండలి సభ్యులు బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్య అవగాహనతోనే పాటలు రాయగలం

**-ప్రముఖ సినీగేయరచయిత మౌనశ్రీ మల్లిక్**



మాట్లాడుతున్న నల్లా రాధాకృష్ణ

**చిక్కడపల్లి, అక్టోబరు 27 (ప్రభాతవార్త):** సమాజంలోని సాహిత్యాన్ని చదివినప్పుడే సినిమాలలో గొప్పపాటలు రాయగలరని ప్రముఖ సినీగేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ అభిప్రాయపడ్డారు. ఆ సాహిత్య అవగాహనతోనే 'ఇండియన్ ఫైల్స్' అనే సినిమాలో తాను రాయగా ఎం.ఎం.కీరవాణి పాడిన 'తిరిగి చూడు తిరిగి చూడు' అనే పాట నాకు ఎన్నో అవార్డులను తెచ్చి పెట్టిందన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో బహుజన సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో అకాడమి తెలంగాణ రాష్ట్ర విభాగం రాష్ట్ర సదస్సు జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎం.గౌతమి అధ్యక్షతన జరిగిన సభకు గౌరవ అతిథిగా హాజరైన అకాడమి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ బహుజన సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడానికి కోసం డిసెంబరు 15న దేశరాజధాని న్యూఢిల్లీలో వెయ్యిమందితో జాతీయ సదస్సును నిర్వహించబోతున్నట్లు వివరించారు. ఈ సదస్సుకు ప్రపంచంలోని ఎనిమిది దేశాల నుంచి, దేశంలోని 27 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో అకాడమి కర్ణాటక రాష్ట్ర అధ్యక్షురాలు, రచయిత ఎన్.పి.వెంకమ్మ, ఏపి విభాగం కార్యదర్శి ఎస్.ఫణి కుమార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మామిడాల సంతోష్‌రెడ్డి, నాజర్‌పాషా, విష్ణు, బలయ్య తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సమావేశానికి హాజరైన విశ్వకర్మ వృత్తిదారుల సంఘం నాయకులు

**సరూర్‌నగర్, అక్టోబరు 27 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో విశ్వకర్మ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి బడ్జెట్‌లో రూ.250 కోట్లు కేటాయించాలని విశ్వకర్మ వృత్తిదారుల రాష్ట్ర సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లో సంఘం నాయకుడు సుంకోజు యాదగిరిచారి అధ్యక్షతన సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన నాయకులు మాట్లాడుతూ విశ్వకర్మవృత్తులు చేసుకునే వృత్తులో కార్పొరేట్ స్థాయి సంస్థలు, కంపెనీలు రావడంతో కుల వృత్తులు చేసుకునే వారు ఇబ్బందులు పడుతున్నారని విచారం వక్తం చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని వారు పనులు లేక నగరాలకు వలస వచ్చి ఇతర పనులు చేసుకుంటున్నారని వారు వెల్లడించారు. ఈ నేపథ్యంలో విశ్వకర్మవృత్తులను ఆదుకోవాలని ప్రభుత్వం అందుకు నిధిని వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు కోరారు. అదే విధంగా వృత్తిదారులను ఆదుకోవడానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన 250 కోట్లు మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాళ్ళబండి కుమారస్వామి, గుంటోజు బీష్మాచారి, శ్రీనివాసాచారి, ఐదుకొట్టుల జగదీశ్వరచారి, నారోజు నర్సింహాచారి, తాటిపాముల కృష్ణమాచారి, యాదాల నారాయణాచారి, శ్రీరామోజు రామాచారి, పుట్టోజు సంతోష్‌కుమార్, శివకోటి విష్ణువారి తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్‌రెడ్డికి ఘన నివాళులు

**సరూర్‌నగర్, అక్టోబరు 27 (ప్రభాతవార్త):** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీకి దివంగత అధ్యక్షుడు పెద్దబావి వెంకట్‌రెడ్డి లేని లోటు ఎన్నటికీ తీర్చలేనిదని తెలంగాణ పిసిసి ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రాణంగా భావించి అహర్నిశలు పని చేసిన వెంకట్‌రెడ్డి ప్రథమ వర్ధంతి బడంగ్‌పేట్ పాత గ్రామ పంచాయతీ చౌరస్తాలో ఘనంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె వెంకట్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పారిజాత మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ఆకాంక్షి వెంకట్‌రెడ్డి పార్టీ అధికారంలోకి వచ్చే ముందే ఈ లోకాన్ని వీడడం అందరినీ బాధించిందని విచారం వ్యక్తం చేశారు. అనునిత్యం పార్టీ కోసం పని చేసిన వెంకట్‌రెడ్డిని పార్టీ నాయకులు, కార్యకర్తలు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిగిరింత నర్సింహారెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి,నాయకులు రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, బాలేనింగ జంగయ్య, గట్టు బాలకృష్ణ, బంగారి అశోక్, దిండు శ్రీనివాస్‌గౌడ్, పెద్దబావి బాబు సుదర్శన్‌రెడ్డితో పాటు సుభాన్ యాదవ్, రంజిత్, సూర్యకాంత్ విజయ్ కుమార్, క్యారగారి శ్రీధర్, గిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



వెంకట్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న పారిజాత, కాంగ్రెస్ నాయకులు

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలి

**సైఫాబాద్, అక్టోబరు 27 (ప్రభాతవార్త):** గడిచిన అసెంబ్లీ ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమ కారులకు సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలుచేసి ఉద్యమకారుల బంధువుగా మారాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యమకారులను గత బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి పెద్దఎత్తున ఎన్నికల ప్రచారం చేసి గెలిపించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా ఇంతవరకు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలలో ఒక్కటీ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని, ఉద్యమ కారులను గుర్తించడానికి ఒక కమిటీని ఏర్పాటుచేసి, గుర్తింపు కార్డులను ఇవ్వాలని, ఉద్యమకారులకు 250 గజాల స్థలం కేటాయించాలని, రూ. 25 వేల పెన్షన్ ఇవ్వాలని, కళాకారులకు సాంస్కృతిక సారథిలో 1000 మందికి ఉద్యోగాలు కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లలో పది శాతం వాటా కల్పించాలని, అమరవీరుల కుటుంబాలను అన్నివిధాలా ఆదుకోవాలని, ఉద్యమ కారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, వృద్ధ కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఉద్యమ కారులను రాష్ట్ర సాధకులుగా గుర్తించి గౌరవించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఫోరం నాయకులు వీరాస్వామి, సుదర్శన్‌యాదవ్, ప్రసాద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమ కారుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చీమ శ్రీనివాస్

# నాయీబ్రాహ్మణుల పొట్టకొడుతున్న కార్పొరేట్ కంపెనీలు

**యువశక్తి రంగారెడ్డి, జిల్లా అధ్యక్షులు నర్సింహనాయి**

**మొయినాబాద్, అక్టోబరు 27, (ప్రభాతవార్త :** రాష్ట్రంలో కొన్ని కార్పొరేట్ కంపెనీలు నాయి బ్రాహ్మణుల పొట్టకొట్టె ప్రయత్నం చేస్తున్నారని సంఘం యువశక్తి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నర్సింహనాయి, మాట్లాడుతూ కొన్ని వందల సంవత్సరాల నుండి క్షౌరవృత్తి పై ఆదారపడి ఈ సమాజలో ఎన్నో మళినాలను ప్రజల వద్దకు రాకుండా కాపాడింది, మంగళివారన్నారు, ఈ దేశంలో వైద్యం లేని సమయంలో గర్భిణీలకు ప్రసవ సమయంలో ఎలాంటి వైద్యవిధ్య,చదువు లేకున్న గ్రామాల్లో ప్రతి ఇంటిలో ఎలాంటి అనార్ధాలు జరగకుండా పండంటి బిడ్డలకు పురుడుపోసింది నాయి బ్రాహ్మణులే, గ్రామాల్లో ఎవరి మరణించినా, వారి వారి యొక్క ఆచారాల ప్రకారం సాంప్రదాయల ప్రకారం దినకర్మలు జరిగితే వారి ఇంటి పేరుతో ఎంత మంది కుల బలగం ఉంటే అంత మందికి డబ్బులు ఉన్నా లేకున్నా కులవృత్తులకు కట్టుబడి సేవలందిచామని గుర్తుచేశారు, ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా యువశక్తి రంగారెడ్డి, జిల్లా అధ్యక్షులు నర్సింహ నాయి,మాట్లాడుతూ నాయి బ్రాహ్మణుల వృత్తి పై కొన్ని కార్పోరేట్ శక్తులు వారి జీవితాలను చిదిమేసేలా ప్రయత్నాలు చేస్తున్నాయని, నగరాల్లో ఎప్పటి నుంచే వా బ్రతుకులను చిదిమేస్తున్నాయని, యూపి, బీహార్, ఒడిసా నుండి తెలంగాణకు వలుసవచ్చి సెలూన్ షాపూలు పెట్టి రాష్ట్ర నాయినాయిబ్రాహ్మణుల పొట్టకోడుతున్నారని, మొయినాబాద్ మండలం లో సెలూన్ కార్పొరెట్ పెర్లతో రెండు కోత్త దుకాణాలు ప్రారంభి చారని, గ్రామ ప చాయితీలు ఇతర రాష్ట్రాల నుండి వచ్చి బ్యూటి పార్లర్‌ల పెర్లతోదుకాణాలు ఏర్పాటుచేస్తున్నారని తక్షనమే ముఖ్యమంత్రి రెవంత్‌రెడ్డి, తక్షణమే చర్యలు తీసుకోవాలని మంగలి కులస్తులు వందల సంవత్సరాలనుండి "కుల వృత్తుల మీద ఆదరపడుతున్నారని, క్షౌర వృత్తి మాకు దైవంతో సమానమన్నారు, బ్యూటిపార్లర్‌ల పెర్లతో గ్రామాలకు వచ్చిన కార్పొరేట్ సంస్థలు గ్రామలకు వచ్చి కులవృత్తులు చేస్తాయా?అని ప్రశ్నించారు, తక్షణమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాయిబ్రాహ్మణుల కులవృత్తుల సంనక్షణకు రక్షణ కవచంగా ఉండి, వాటిని కాపాడలని నాయిబ్రాహ్మనులు తప్పా మరెవరు క్షౌర వృత్తిని చెయకూడదని జీవో విడుదల చేయాలని ఈ సందర్బంగా కోరారు, నాయిబ్రాహ్మనులంతా యువశక్తి పెరుతో అందరు ఏకమై ఉన్నామని త్వరలోనే యువశక్తి రాష్ట్ర నాయకత్వ ప్రభుత్వాన్ని కలుస్తుందని నాయిబ్రాహ్మనుల డిమాండ్‌లను వెల్లడిస్తుందన్నారు, సమాజంలో అన్నికులాల మద్దతు మానాయిబ్రాహ్మనులకు ఉందన్నారు, వెంటనే రాష్ట్ర ప్రభుత్వ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు, కాదని కార్పొరెట్ పేర్లతో బ్యూటి పార్లల పెర్లతో అనుమతులిస్తే గ్రామాల్లో కులవృత్తు లకు అనుమతులు ఇచ్చిన అధికారులే రావాల్సి ఉంటుందన్నారు, మా న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వ పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు.

## అనుమతి లేకుండా బాణసంచాలు నిల్వ చేస్తే చర్యలు : ఎసిపి వాసాల సతీష్

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** వ్యాపారస్థులు అనుమతి లేకుండా బాణసంచాలు నిల్వ చేసినా,తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హుస్నాబాద్ ఎసిపి వాసాల సతీష్ హెచ్చరించారు.ఆదివారం రోజున ఎసిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసే బాణసంచా దుఖానాలలో ప్యాపారస్థులు పోలీస్,మున్సిపల్,అగ్నిమాపక, విద్యుత్ శాఖలు నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే బాణసంచాలు విక్రయించాలని, దుకాణాల సమీపంలో ఇసుక, నీరు, ఫైర్ ఎక్స్‌ట్రిమిషన్‌లు ఉంచుకోవాలన్నారు.బాణ సంచాలు విక్రయించే వారితో పాటు కాల్చే వారు సైతం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.ప్రతీ వ్యాపారస్థుడు కూడా కచ్చితంగా అనుమతి తీసుకుని మాత్రమే దుఖానాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే దుఖానాలు జనవాసాలకు, పెట్రోల్ బంక్‌లకు అగ్ని ప్రమాదాలు జరిగేలాంటి ప్రదేశాలకు దూరంగా ఉంచాలన్నారు.

## అక్కన్నపేటకు అంబులెన్స్ మంజూరు చేయండి

**బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్**

**అక్కన్నపేట, అక్టోబరు 27,ప్రభాతవార్త :** అక్కన్నపేట మండలానికి ప్రభుత్వం అంబులెన్స్ మంజూరు చేయాలని బిఎస్పి నియోజకవర్గ ఇంచార్జీ పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ డిమాండ్ చేశారు.ఆదివారం రోజున మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పార్టీ నాయకులతో కలసి సందర్శించారు.ఆదివారం మద్యాహ్నామే ఆసుపత్రి తాళం వేసి ఉండడాన్ని తీవ్రంగా ఖండించారు.మండలంలో 37 గ్రామ పంచాయతీలతో పాటు 61తండాలు ఉన్నాయని ఈ ప్రాంతంలో ఎక్కువ శాతం నిరుపేద కుటుంబాలకు చెందిన వారితో పాటు గిరిజనులే ఎక్కువ ఉంటారని ఈ ప్రాంతంలో కనీసం ఒక్క ప్రయివేట్ ఆసుపత్రి కూడా లేదని ఉన్న ఆసుపత్రికి తాళం వేస్తే ప్రజలు అనారోగ్యాలకు గురైతే ఎక్కడికి వెళ్లాలని ప్రశించారు.ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాద్యత ప్రభుత్వం పైనే ఉందని కావున ఆసుపత్రిలో పూర్తి స్థాయి సిబ్బందని నియమించి రోగుల సౌకర్యార్థం అంబెలెన్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎనగందుల శంకర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## కార్మికులకు అండగా సిఐటియు

**-రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు**

**గుమ్మడిదల, అక్టోబరు 27 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామిక వాడలో ఆదివారం న్యూ లాండ్ పరిశ్రమ కార్మికులు ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిథిగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు హాజరయ్యారు. వేతన ఒప్పందం పూర్తయిన సందర్భంగా అభినందన సభను కార్మికులు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ న్యూలాండ్ పరిశ్రమలో చారిత్రాత్మకమైన వేతన ఒప్పందం కార్మికుల ఐక్యతతో చేయడం జరిగిందని అన్నారు. ఇంత మంచి వేతన ఒప్పందం చేయడానికి ఐక్యంగా ఉన్న కార్మికులకు జేజేలు తెలియజేశారు. తక్కువ సమయంలో వేతన ఒప్పందం పూర్తి చేయడం జరిగిందన్నారు. 14 వేల రూపాయలు, ఇతర అనేక సౌకర్యాలు వేతన ఒప్పందంలో సాధించడం జరిగిందన్నారు. వీడీఏ పెంచడం, రిటైర్‌మెంట్ బెనిఫిట్‌లు, అనేక కొత్త కొత్త సౌకర్యాలు సాధించడం జరిగిందన్నారు. సీఐటీయూ ఉన్నచోట కార్మికులకు అనేక సౌకర్యాలు సాధించి పెట్టడం జరుగుతుందని, ఇది సీఐటీయూ గొప్పతనం అని అన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికులందరూ ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని కోరారు. కార్మికులకు అండగా ఉండే ఎర్ర జెండా సీఐటీయూ మాత్రమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి. మల్లేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు కె. రాజయ్య, యూనియన్ జనరల్ సెక్రటరీ వెంకటేష్, నాయకులు శ్రీధర్ తదితరులు ప్రసంగించారు.



నిల్వ ఉన్న మురుగు నీటిని తొలగిస్తున్న అధికారులు

**వార్త ఎఫెక్ట్**

## గౌరవెల్లిలో నిల్వ ఉన్న మురుగు నీటి తొలగింపు

**అక్కన్నపేట, అక్టోబరు 27,ప్రభాతవార్త :** శనివారం రోజున ప్రభాతవార్తలో పంచాయతీలలో గాడి తప్పిన పాలన అనే శీర్షికతో ప్రచూరితమైన వార్త మండల అధికారులను కదిలించింది. ప్రభాతవార్తలో ప్రచూరితమైన వార్తను చూసిన మండల ప్రజా పరిషత్ అధికారి బానోతు జయరాం ఆదేశాల మేరకు ఎంపివో గుగులోతు మోహన్‌నాయక్ ఆదివారం ఉదయమే గౌరవెల్లి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన నిర్వాసితులు నిర్మించుకున్న ఇండ్లకు దారి లేకుండా నిల్వ ఉన్న మురుగు నీటిని పరిశీలించారు. జెసిబి సహాయంతో ఆ మురుగు నీటిని తొలగించే వరకు అక్కడే ఉన్నారు.అనంతరం గ్రామంలో లోతట్టు ప్రాంతంలో ఉన్న పలువురు ప్లాట్ల యజమానులు ప్లాట్లలో మట్టి పోయించుకుని నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వారికి నోటీసులు జారీ చేయాలని కార్యదర్శి మాలోతు నిర్మళను ఆదేశించారు.యజమానులు వినని పక్షంలో అట్టి ప్లాట్లను గ్రామ పంచాయతీ స్వాదీనం చేసుకోవడం జరుగుతుందని వారికి హెచ్చరికలు జారీ చేశారు.అయితే ఈ విషయాన్ని కాలనీ వాసులు అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఏ అధికారి పట్టించుకున్న పాపాన పోలేదని,ప్రభాతవార్తలో వార్తను ప్రచూరించి సమస్యను పరిష్కరించినందుకు ప్రభాతవార్త ప్రతినిధులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు జరిగే ఎమ్మార్పీఎస్ సదస్సును విజయవంతం చేయాలి

**వెల్దుర్తి, అక్టోబరు 27 ప్రభాతవార్త:** ఈ నెల 28న ఎమ్మార్పీఎస్ సదస్సును సిద్ధిపేటలో నిర్వహించడం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాసాయిపేట యాదగిరి మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా మందకృష్ణమాదిగ హాజరవుతున్నారని, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ తీరును ఎండగడదామని, మాదిగలు మరో యుద్ధానికి సిద్ధం కావాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టి మాదిగలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. మాదిగలు న్యాయం జరిగేలా చూస్తానని హామీఇచ్చిన సిఎ ఇప్పుడు స్పందించడం లేదన్నారు.




సికింద్రాబాద్‌లో ఇంపీరియల్ గార్డెన్స్‌లో పురాతన వాహనాల ప్రదర్శనలో ఉంచిన కారును పరిశీలిస్తున్న ప్రజలు

# గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

**సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి**

**సరూర్‌నగర్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:** రాష్ట్రంలో గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. ఆదివారం మీర్‌పేట్ లెనిన్‌నగర్‌లో తెలంగాణ గిరిజన సమాఖ్య బాలాపూర్ మండల సమావేశం జరిగింది. సమాఖ్య జిల్లా కార్యదర్శి జర్పుల శివనాయక్ ఆధ్వర్యంలో రమావత్ చత్రు నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రవీంద్రచారి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలు నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. దీని వల్ల బడుగు, బలహీన వర్గాల వారిపై దాడులు పెరిగి నిందితులకు శిక్షలు లేకుండా పోతున్నాయని ఆయన అన్నారు. అంతే కాకుండా అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులకు దక్కాల్సిన భూములు దక్కకపోవడంతో పాటు వారిపై పోలీసుల, ఫారెస్టు అధికారుల జులుం పెరిగి వారు సాగు చేస్తున్న భూములను బలవంతంగా స్వాధీనం చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. ఇక ముందైనా ప్రభుత్వాలు స్పందించి గిరిజనుల హక్కులను కాపాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బండ యాదమ్మ యాదవ్, పిచ్చిరాజు, శంకరయ్య, జాజాల అంజయ్య, కిరణ్ నాయక్, నవీన్ నాయక్, మధు నాయక్, నాగరాజు నాయక్, రాజేష్ నాయక్, మధుచారి, చందులాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో బాలాపూర్ మండల గిరిజన సమాఖ్య అధ్యక్షునిగా జఠావత్ రెడ్యా నాయక్‌ను, కార్యదర్శిగా రమావత్ చత్రునాయక్‌ను, ఉపాధ్యక్షునిగా రవినాయక్‌ను, సహాయ కార్యదర్శిగా కేతావత్ బాలు నాయక్‌ను, కోశాధికారిగా నేనావత్ కిషన్‌నాయక్‌ను, కార్యవర్గ సభ్యునిగా హనుమా నాయక్, కౌన్సిల్ సభ్యునిగా దత్తు నాయక్‌ను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న రవీంద్రచారి

## రాష్ట్రంలో 10 లక్షలకుపైగా ఉజ్వల కనెక్షన్లు

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**కంటోన్మెంట్, అక్టోబరు 27 ప్రభాతవార్త :** ప్రజలందరికి అందుబాటు ధరల్లో భద్రతతో కూడిన ఇంధనం అందుబాటులో ఉంచాలనేది మోదీ సర్కారు లక్ష్యమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఎల్‌పీజీ వల్ల కాలుష్య రహిత పద్ధతిలో వంట చేసుకోవడంతో పాటు ఆరోగ్యం కాపాడుకోవడం పర్యావరణ పరిరక్షణలో భాగమని అన్నారు. సికింద్రాబాద్ కిక్ విలేజ్ గాయత్రి గార్డెన్‌లో ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్స్ సమిమ్మట్ 2024లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు తీసుకురావడంలో ఎల్‌పీజీ పాత్ర ఎంతో కీలకమన్నారు. కట్టెలపొయ్యి పొగతో మనదేశంలో పేద అక్కా చెల్లెళ్ల కళ్లల్లో నీళ్ల రావొద్దనే లక్ష్యంతో మోదీ ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని తీసుకొచ్చారని తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 10కోట్లకు పైగా పేద మహిళలకు ఈ స్కీం అందజేసినట్లు వివరించారు. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే దాదాపు 15లక్షలకు పైగా ఉజ్వల కనెక్షన్‌లు ఉన్నాయన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలోని 90 శాతం ఇళ్లల్లో ఎల్పీజీ కనెక్షన్‌లు ఉన్నాయన్నారు. వినియోగదారులకు సకాలంలో రీఫిల్‌లు అందజేయడంలో డిస్ట్రిబ్యూటర్‌ల కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

**మనిషి ఎలా బ్రతకాలో బ్రతకకూడదో చెప్పే**

## 'జేబు చెప్పిన ఊసులు' : రమణాచారి

**రవీంద్రభారతి, అక్టోబరు 27 ప్రభాతవార్త :** జేబులో డబ్బులు ఎవరి కోసం ఖర్చుపెట్టినా మన అవసరాల కోసం ఎంతోకొంత జాగ్రత్త చేసుకోవాలి.. దాచుకున్న డబ్బు చివరిదశలో ధైర్యాన్నిస్తుంది, ఆసరాగా నిలుస్తుంది.. మన ఖర్చుల్ని, తొందరపాటుతనాన్ని ఆప్తులేకాదు వేసుకున్న చొక్కాజేబులు కూడా ప్రశ్నిస్తుంటాయి.. ఆ జేబు చెప్పే నిజాలు మన జీవితాలను సక్రమంగా నడుచుకోమని ప్రేరేపిస్తూ మనిషి ఎలా బ్రతకాలో, ఎలా బ్రతకకూడదో చెప్పే వాస్తవ సంఘటనల సమాహారమే జేబు చెప్పిన ఊసులు నాటకం అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి తెలిపారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసరంజని ఆధ్వర్యంలో ప్రతీనెలా నాటకం.. ప్రేక్షకుడికి వినోదం.. నటుడుకి ఆనందం, అదే మాబాట మాటనే నినాదంతో నిర్వహిస్తున్న నాటక ప్రదర్శనలో భాగంగా నేడు 28 సోమవారం రాత్రి 6.30గంటల నుండి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సిరిముచ్చ కల్చరల్స్ హైదరాబాద్ సమర్పణ, స్నిగ్ధ రచన, మంజునాథ దర్శకత్వంలో రూపొందిన జేబు చెప్పిన ఊసులు నాటకం ప్రదర్శింపబడుతుందని, అధిక సంఖ్యలో నాటకప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి ఈ సందేశాత్మక నాటకాన్ని దర్శించి సంస్థను, కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

## తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం

**నిజాంపేట్, అక్టోబరు 27, ప్రభాతవార్త**

హైదరాబాద్‌లో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో వివిధజిల్లాలకు సంబంధించిన సభ్యులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా జరిగినటువంటి కార్యక్రమంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని కూడా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జగన్మోహన్ వ్యవహరించగా ఇండియన్ ఒలింపిక్ సంఘం ఎకెఎఫ్‌ఐ సభ్యులు అబ్జర్వర్‌లుగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకో వడం జరిగింది. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా కాసాని వీరేష్ ముదిరాజ్, ప్రధానకార్యదర్శిగా మహేందర్‌రెడ్డి, కోశాధికారిగా రవి, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షునిగా ఎన్నుకోవడిన కాసాని వీరేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ తనను అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## శబరిమలకు అయ్యప్పస్వాముల పాదయాత్ర

**ఘట్‌కేసర్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ నుంచి ఆదివారం అయ్యప్పస్వాములు శబరిమలకు పాదయా త్రగా బయలుదేరారు. ఘట్‌కేసర్ మున్సిపల్ శివారెడ్డిగూడలోని శ్రీదండ్లగడ్డ ప్రసన్నవీరాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం అయ్యప్పదీక్షలో ఉన్న స్వాములు గురుస్వామి చేతుల మీదుగా ఇరుముడి పుచ్చుకొని ప్రత్యేక పూజలు చేసి శబరిమలకు పాదయాత్ర చేపట్టారు. శ్రీధర్మశాస్త్రసేవాసమితి స్వాములు టి.కిరణ్‌గౌడ్, బి.మనోజ్, బి.తరుణ్, వెంకట్‌రాంరెడ్డి, బి.రవికాంత్, పి.మహేందర్, పి.భానుచందర్, ఎస్.వినోద్, జె.సందీప్‌లు మహాపాదయాత్రలో పాల్గొంటున్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ నుంచి పవన్‌నాయుడు గురుస్వామి ఆధ్వర్యంలో శబరిమలకు వెళ్లి డిసెంబర్ 3న అయ్యప్పస్వామిని దర్శించుకోనున్నారు. ఈసందర్భంగా సన్నిధానం స్వాములు వారికి వీడ్కోలు పలికారు.

### కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ జీవన్‌రెడ్డి**

**దూల్‌మిట్ట, అక్టోబరు 27, ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కామెడీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం దూల్‌మిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఐకెపి వద్ద కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండిచిన పంటను దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధర ఏ గ్రేడ్‌కు 2320 కాగా బి గ్రేడ్‌కు 2300 ఉందన్నారు.రైతులు ధాన్యాన్ని కళ్లాల వద్దే ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి,మండల అధ్యక్షులు కోల సాయిలు, మండల ప్రధానకార్యదర్శి గద్దల మహేందర్,మద్దూర్ మండల కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మనోహర్, మాజీ సర్పంచ్ బండి చంద్రయ్య, లక్ష్మీరెడ్డి, కనుకయ్య, నాయకులు రామిరెడ్డి, సతీష్, రాజయ్యమహేందర్ పాల్గొన్నారు.

### మూఢ నమ్మకాలపై పోలీస్ కళా బృందం అవగాహన

**వెల్దుర్తి, అక్టోబరు 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎం.జలాల్‌పూర్ తండాలో శనివారం రాత్రి బాణమతి, మూఢ నమ్మకాలపై పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ ఆదేశానుసారం స్థానిక ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ సురేందర్, లాయక్ అలీల ఆధ్వర్యంలో తండా వాసులకు బాణమతి, మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. బాణమతి, మంత్రాలు అనే మూఢనమ్మకాలను ప్రజలు నమ్మవద్దని అన్నారు. గ్రామాల్లో మూఢ నమ్మకాలను విడనాడి నవ సమాజంలో జరుగుతున్న అభివృద్ధి వైపు అడుగు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బందితో పాటు తండా వాసులు పాల్గొన్నారు.

## పెట్రోల్‌బంకుకు నిప్పుపెట్టిన కేసులో ఇద్దరి అరెస్ట్

**నాచారం, అక్టోబరు 27 ప్రభాతవార్త:** మల్లాపూర్ ఇండియన్ పెట్రోల్ బంక్‌కు లైటర్‌తో నిప్పు పెట్టిన వ్యక్తిని నాచారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించని క్యాషియర్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై మైబెల్లి కథనం ప్రకారం. శనివారం రాత్రి మీర్‌పేట్‌కు చెందిన చందన్‌కుమార్ (19) మరో ఇద్దరితో కలిసి మల్లాపూర్ ప్రధాన రోడ్డులో ఉన్న ఇండియన్ పెట్రోల్ బంక్ (బ్రయిట్ వే ఫ్యూయల్ స్టేషన్)కు పెట్రోల్ పోయించుకునేందుకు వచ్చాడు. ఇతని తరువాత పెట్రోల్ కోసం డబ్బాతో వచ్చిన వ్యక్తికి క్యాషియర్ పెట్రోల్ పోశాడు. దీంతో ముందుగా వచ్చిన చందన్‌కుమార్ ఆగ్రహంతో ఊగిపోయాడు. తనకు ముందుగా పెట్రోల్ పోయాలని లేనిచో పెట్రోల్ బంక్‌ను కాల్చుతానని హెచ్చరించాడు. అవునా కాల్చుచూద్దాం అంటూ క్యాషియర్ బదులు ఇచ్చాడు. దీంతో అతని జేబులో ఉన్న లైటర్ (పెట్రోల్ గన్)తో పెట్రోల్ పోస్తుండగా వెలిగించాడు. దీంతో ఒక్కసారిగా మంటలంటుకున్నాయి.దీంతో మేనేజర్ బిక్షపతి వెంటనే స్పందించి మంటలను ఆర్పాడు. అనంతరం పెట్రోల్ బంకుకు నిప్పుపెట్టిన చందన్‌కుమార్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

## డిజె నృత్యాలతో న్యూసెన్స్..ఆరుగురిపై కేసు నమోదు

**-డిజె సిస్టమ్ స్వాధీనం**

**ఘట్‌కేసర్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** ఫామ్ హౌస్‌లో డిజే శబ్దాలతో న్యూసెన్స్‌చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఘట్‌కేసర్ సీఐ పి.పరశురాం తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ అంకుశాపూర్ సమీపంలోని కాంటినెంట్ ఫామ్‌హౌస్‌లో డిజే పెట్టి నృత్యాలు చేస్తూ న్యూసెన్స్ చేస్తున్నారని స్థానికులు ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఫాంహౌస్‌కు చేరుకొని తనిఖీచేసి విచారణ జరిపారు. కార్యక్రమం నిర్వహిస్తున్న వరుణ్, వికాస్, డిజే యాజమాని అంజన్‌కుమార్, డిజే ఆపరేటర్ లోకేశ్వర్, కాంటినెంట్ మేనేజర్ సుధీర్, కాంటినెంట్ యాజమాని ఆకాష్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డిజే నిషేధం ఉండగా ఫాంహౌస్‌లో డిజే సౌండ్ సిస్టమ్‌ని ఏర్పాటు చేయడంతో డిజే సామాగ్రిని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు జరుపుతున్నామని సీఐ పరశురాం తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## ఉచిత వైద్య శిబిరంతో ప్రజలకు ఎంతో మేలు

**ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**

**పెద్దేముల్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరంతో ప్రజలకు ఎంతో మేలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలంలోని ఓమ్లా నాయక్‌తాండాలో సుమిత్ర రాథోడ్ అధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవీయ కోణంలో మారు మూలతాండా ప్రాంతంలో ప్రజా ఆరోగ్యం కోసం సుమిత్ర హెల్త్‌క్యాంపు నిర్వహించడం హర్షనీ యమని అన్నారు. ప్రతిఒక్కరు సమాజసేవే పరమార్థంగా భావించి అందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సుమిత్రను, విరించి ఆసుపత్రి యాజమాన్యంను, వైద్య సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ అంజయ్య, వైస్ చైర్మెన్ ఎస్. నారాయన్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి ధారాసింగ్, జిల్లా కాంగ్రెస్ మహీళా అధ్యక్షురాలు శోభరాణి, ఏ బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సిములు, మాజీ యంపిటిసి విద్యా సాగర్, ఉప్పరి మల్లేశం, డివై నర్సిములు, మాజీ సర్పంచ్ బాబు సింగ్ పాల్గొన్నారు.

## ప్రజాసేవకే తన జీవితం అంకితం

**ప్రభుత్వ చీఫ్‌విప్ పి.మహేందర్‌రెడ్డి**



మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**పెద్దేముల్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** ప్రజాసేవకే తన జీవితం అంకితమని శాసనమండలి ప్రభుత్వ చీఫ్‌విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వివిధ శుభకార్యాలలో పాల్గొనడానికి వచ్చిన పి. మహేందర్‌రెడ్డికి పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతంపలికి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాలలో నిరంతరం వెన్నంటే ఉంటు వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని అన్నారు. తన జీవితం ప్రజా సమస్యల పరిష్కారానికేఅంకితమని అన్నారు. చీఫ్‌విఫ్‌ను సన్మానించిన వారిలోమాజీ సర్పంచ్‌లు పి.బలవంతురెడ్డి, పి.ప్రకాషం, లాజర్, మాజీ యంపిటిసి యాలటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు దుగ్గాపూర్ శ్రీనివాస్, రుక్మాపూర్‌చంద్రప్ప, మాన్య నాయక్, ఖలీల్, సంతోష్, బాలయ్య, రమేష్, అయాజ్ తదితరులు ఉన్నారు.

## అధైర్యపడవద్దు అండగా ఉంటాం

**ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**



కోహీర్ బిచ్చన్నను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

**పెద్దేముల్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** అధైర్యపడవద్దని అండగా తాముంటామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి భరోసా కల్పించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన పెద్దేముల్ మండల కేంద్రానికి కోహీర్ బిచ్చన్నను ఆదివారం ఎమ్మెల్యే పరామర్శించారు. బిచ్చన్న ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీసి తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజల కష్టసుఖాలలో తాను వెన్నంటే ఉంటానని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట మాజీ డిఎల్‌డిఏ చైర్మెన్ పి.నారాయన్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి ధారాసింగ్, కోటపల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ జి.అంజయ్య, వైస్ చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, మాజీ యంపిటిసి విద్యాసాగర్, సీనియర్ నాయకులు జితేందర్‌రెడ్డి, ఉప్పరి మల్లేశం, డివై నర్సిములు తదితరులు ఉన్నారు.

## ఇష్టారాజ్యంగా రేషన్‌బియ్యం సరఫరా

**దౌల్తాబాద్, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** నిరుపేధలకు అందవలసినటువంటి రెషన్‌బియ్యాన్ని కొంతమంది మండలానికి చెందిన అక్రమవ్యాపారులు ఇష్టారాజ్యంగా ఇతర ప్రాంతాలకు సరఫరచేస్తున్నారు. మండల పరిదిలోని ఈర్లపల్లి, దేవర్‌ఫస్లవాద్, గోకఫస్లవాద్, దౌల్తాబాద్, అంతారం తదితర గ్రామాలలో కొంతమంది అక్రమవ్యాపారులు రెషన్‌బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు సరఫర చేస్తున్నారు. ఇంతజరుగుతున్నా సంబందిత అధికారులు మాత్రం ఇట్టివిశయాన్ని పట్టించుకోకుండా అటువైపు కన్నెత్తికూడ చూడటంలేదని పలువురి అబిప్రాయం. నిరుపేధలకు అందవలసినటువంటి ఉచితరెషన్‌బియ్యం కొంతమంది అక్రమవ్యాపారుల వల్ల నిరుపేదలు నష్టపోతున్నారు. మండలానికి చెందిన ఆయా గ్రామాల్లో ఊరి చివర ఉన్న ఇల్లను అద్దాలుగా మార్చుకొని ఆ ఇల్లల్లోకి అక్రమ రేషన్‌బియ్యాన్ని తరలించి ప్రజలు ఎవరులేని సమయంలో రాత్రివేలల్లో వ్యాపారులు ఇతర ప్రాంతాలకు రేషన్‌బియ్యం సరఫరచేస్తున్నారు. ఈదందా ఎన్నోసం వత్సరాలనుండి కోనసాగుతున్నా అధికారులెవ్వరుకూడ పట్టించుకోవ డంలేదు. రేషన్‌బియ్యం అక్రమరవాణాను అరికట్టేందుకు అధికారులెవ్వరుకూడ చర్యలు తీసుకోకపోవడంతో ఈవ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతుంది. ఇప్పటికైన సంబందిత ఉన్నతస్థాయి అధికారులు స్పందించి అక్రమ రేషన్‌బియ్యం సరఫరను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

### ఘనంగా కమల్‌వాచ్ కంపెనీ గోల్ఫ్‌కప్

హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో అక్టోబర్ 19న జరిగిన కమల్ వాచ్ కంపెనీ గోల్ఫ్ ఘనమైన విజయాన్ని సాధించింది. ఓమేగా ఇండియా సహకారంతో నిర్వహించిన టోర్నమెంట్ ప్రారంభ ఎడిషన్‌ను సూచిస్తుంది. కమల్ వాచ్ కంపెనీ నిరహించిన తొలిగోల్ఫ్ టోర్నమెంట్‌లో 100 మంది ఉత్సాహవంతులైన గోల్ఫ్‌క్రీడాకారులతో కలిసి ఓమెగా ఇండియా బ్రాండ్ హెచ్‌సుమిత్ శర్మ సందడి చేశారు.

## ఆరోగ్యం మనిషి ప్రాథమిక హక్కు

**క్రిస్టియన్ కాలనీలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం**



షాద్‌నగర్‌లో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 27) :** ఆరోగ్యము మనిషి ప్రాథమిక హక్కు అని, ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని షాద్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.ఎస్.నటరాజన్ అన్నారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని 16వ వార్డు క్రిస్టియన్ కాలనీలోని కుంటబడిలో లయన్స్ క్లబ్ హైదరాబాద్ కోఠి వారి సౌజన్యంతో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఒగ్గు కిశోర్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.ఎస్.నటరాజ్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని, ఆరోగ్య పరిసరాలను కల్పించుకోవాలని, మానసిక ఒత్తిడిని అధిగమించాలని సూచించారు. ఒగ్గు కిశోర్ మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరంలో కంటి చూపు కోసం ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారని, అదేవిధంగా బీపీ, షుగర్, పళ్ళు, ఎముకల, మహిళలకు సంబంధించిన సమస్యలపై పరీక్షలు చేసేందుకు ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు ఈ అవకాశం ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు నారాయణ రెడ్డి, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సాయం



ఇంటి నిర్మానానికి ఆర్థికసాయం అందిస్తున్న రవీందర్‌రెడ్డి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 27) :** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామానికి చెందిన సర్దార్ ఖాన్ ఇంటి నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ ఫరూఖ్‌నగర్ మండల యువ నాయకుడు రవీందర్ రెడ్డి పదిహేను వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కర్రె కిష్టమ్మ, చెనిగారి యాదమ్మలకు చెరో ఐదు వేల చొప్పున చికిత్స నిమిత్తం అందించారు. గ్రామంలోని రోడ్లను పరిశుభ్రం చేయించారు. సొంత నిధులతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న రవీందర్ రెడ్డిని గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ చెన్నకేశవులు, కొత్తపల్లి రాంరెడ్డి, సంజీవరెడ్డి, కండ్లపల్లి కన్న, సాలె చెన్నయ్య, చెనిగారి రాములు, చెనిగాని భీమయ్య, కరుణాకర్, చెనిగారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ కోసం బీజేపీలో సభ్యులుగా చేరండి

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య పిలుపు**



బీజేపీ సభ్యత్వాన్ని అందజేస్తున్న అందె బాబయ్య

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 27) :** వికసిత్ భారత్ లక్ష్యం కోసం ప్రతి ఒక్కరు బీజేపీ పార్టీలో చేరాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య పిలుపునిచ్చారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులు ఎంకనోళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టగా, ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకనోళ్ల వెంకటేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడి పనిచేసే కార్యకర్తలకే పార్టీలో ప్రాధన్యత లభిస్తుందని, క్రియాశీల సభ్యులుగా సభ్యత్వం పొందేందుకు ప్రతి ఒక్కరు వందకు పైగా సభ్యత్వాలు చేయాలని సూచించారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారని అన్నారు. ప్రపంచంలోనే ఎక్కువ సభ్యత్వాలు కలిగిన పార్టీ బీజేపీ పార్టీ అని, మన సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడుకోవాలంటే బీజేపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈనెల 30న సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగుస్తుందని, నాయకులు కార్యకర్తలు సాధ్యమైనంత ఎక్కువ సభ్యత్వాలు చేయించాని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చ ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు సంగెం శ్రీకాంత్, అంబటి వెంకటేష్, పిట్టల జంగయ్య, శివకుమార్, రంజిత్ నర్సింలు, రాము, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడవద్దు

**ఆమనగల్లు, అక్టోబర్27, ప్రభాతవార్త:** సుధీర్ఘకాలంగా ప్రజలకు సేవలందించా లంటే అభివృద్ధి పనులలో రాజీ పడకుండా నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలని ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతూ మౌలిక వసతుల కల్పనతో వార్డును తీర్చిదిద్దు తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 15వ వార్డు ఉదయ్‌నగర్ కాలనీలోని నల్లాల బావి నుండి మాద్గుల రోడ్డు వరకు టీయుఎఫ్ఐడీసీ నిధులు రూ. 60 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న అంత ర్గత మురుగుకాల్వ పనులను లక్ష్మణ్ పరిశీలించారు. నిర్మాణ కార్మికులతో మాట్లాడి అలసత్వం లేకుండా పనులు నాణ్యతగా చేపట్టాల న్నారు. దశాబ్దాల కాలంగా ఈప్రాంతంలో మురుగు నేలపైనే పారడంతో చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్య పరిష్కారానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అంతర్గత మురుగు కాల్వ నిర్మిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రజాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి వీధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నట్లు లక్ష్మణ్ తెలిపారు. కాలనీవాసులు వెంకటేశ్, మున్సి పాలిటీ కార్యాలయ సిబ్బంది షర్ఫొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్



ఆమనగల్లులో జరిగిన గార్మీ షరీఫ్ వేడుకల్లో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

## ఘనంగా గార్మీ షరీఫ్ వేడుకలు

**ఆమనగల్లు, అక్టోబర్27, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలో ఆదివారం గార్మీ షరీఫ్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మసీదు కాలనీలోని మహబూబా సుభాని దర్గా వద్ద అంజుమనే గులామ్ ముస్తఫా కమిటీ ఆధ్వర్యంలో వేడుకలను భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. పట్టణానికి చెందిన ముస్లీం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరైనారు. ఈమేరకు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. స్థానిక మత గురువు హాఫీజ్ మౌలానా వాహేద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం వేడుకలకు హాజరైన వారికి అన్నదానం చేశారు. కార్య క్రమంలో జామియా మసీదు కమిటీ అధ్యక్షులు మహ్మద్ మాసూమ్,రజాక్, ఖాదర్, అజీమ్, కలీమ్, ఇమ్రాన్, ముస్తఫా కమిటీ సభ్యులు అక్రమ్, అక్సర్, బాబా, అజహర్, అబ్బాస్, ఆరీఫ్, అమిర్ పాషా, అసద్, అంజద్, సోహెల్, గౌస్, రావుఫ్, గౌస్, బాషా, ముధసిర్, ముజంమిల్, అబేద్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్1 మేయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాం

**తహసీల్దార్ గౌతమ్ కుమార్**



**మొయినాబాద్, అక్టోబర్ 27, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండలంలో గ్రూప్1 మొయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించామని మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్ కుమార్ అన్నారు, ఆదివారం గ్రూప్ 1 మొయిన్స్ చివరి రోజు ఆదివారంతో గ్రూప్1 పరీక్షలు పూర్తియిపోయాయన్నారు, గత వారం రోజులుగా మండల కేంద్రంలోని వివిద ఇంజనీరింగ్ కళశాలలో ఏర్పాటుచేసినటువంటి సెంటర్‌లను పక్కద్బందిగా ఎప్పటికప్పుడు పర్యావేక్షించామన్నారు, పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాసేటువంటి వారికి ఎలాంటి సమస్యలు తలేత్తనివకుండా ఎప్పటికప్పుడు ముందస్తు జాగ్రతలు తీసుకున్నామన్నారు, ఆదివారం గ్రూప్1 మేయిన్స్ కు హజరయిన వారి సంఖ్య సెంటర్‌లవారిగా పరీక్షకు హజరయిన విద్యార్థుల యొక్క వివరాలను వెల్లడించారు, విద్యాజోతి ఇంజనీరింగ్ కళశాల సెంటర్ కోడ్ :29 మొత్తం 984 మందికి గాను 580 మంది విద్యార్దులు హజరయ్యారు, 404 మంది గైరజరయ్యారు, సెంటర్ కోడ్ :30 జోగిన్‌పల్లి బి.ఆర్ ఇంజనీరింగ్ కళశాలలో 816 మందికి గాను 445 మంది హజరయ్యారు, 371 మంది ఆబ్‌సెంట్ అయ్యారు, సెంటర్ కోడ్ :31 సెంటర్ ఏ. కెజిరెడ్డి ఇంజనీరింగ్ కళశాలలో 600 మందికి గాను హజరుకావాల్సి ఉండగా, కేవలం 358 మంది హజరయ్యారు, 242 మంది ఆబ్‌సెంట్ అయ్యారు, సెంటర్ కోడ్ :32, కేజిరెడ్డి ఇంజనీరింగ్ కళశాల సెంటర్,బి.లో 600 మందికి గాను 348 మంది హజరయ్యారు, 252 మంది ఆబ్‌సెంట్ ఆయ్యారని తెలిపారు, ఈ కార్యాక్రమంలో చేవెళ్ల తహసీల్దార్ క్రిష్ణ, ఆర్ఐ సుజిత్ రెడ్డి, చేవెళ్ల ఆర్ఐ పాండు, తధితరులు పాల్గొన్నారు.

## మాలలు తమ హక్కులను సాధించుకోవాలి

**చొక్కంపేట ఆంజనేయులు**



మాలల ఆత్మగౌరవ సభకు తరలిన నాయకులు

**షాబాద్, అక్టోబర్ 27, ప్రభాతవార్త :** మాలలు సంఘటితమై తమ హక్కులను సాధించుకుందామని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చొక్కంపేట ఆంజనేయులు అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్‌లో నిర్వహించే మాలల ఆత్మగౌరవ సభకు షాబాద్ నుండి నాయకులు బయలుదేరి వెళ్లారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మాలలు సంఘటితమై తమ హక్కులను సాధించుకుందామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు ఆశోక్, బాల్‌రాజ్, చంద్రశేఖర్,వేణుగోపాల్, మల్లేష్, కృష్ణ,ప్రవీణ్, రాఘవేంద్ర, మహేష్, శేఖర్ తదితరులు ఉన్నారు.

## ఎంబిబిఎస్ సీటు సాధించిన మంజులకు అభినందనలు



**తలకొండపల్లి, అక్టోబర్ 27, ప్రభాతవార్త :** గడ్డమీది తండా గ్రామపంచాయతీ పరిధిలోని ఆర్లకుంట తండాలో బాణావత్ విష్ణు తండ్రి అత్య కూతురు బాణావత్ మంజుల గ్రామ పంచాయతీ పరిధిలో మొదటి అమ్మాయిగా ఎంబిబిఎస్ సీటు సాధించినందున భాణావత్ చందు చారిటబుల్ ట్రస్ట్ తరపున డాక్టర్ భీమ్లాల్ అభినందనలు తెలుపుతూ 3000రూపాయలు ఆర్థిక సహాయం అందించి బాణావత్ విష్ణు శారదలను ఘనంగా సన్మానించారు. గ్రామ పరిధిలో అమ్మాయిలు ఇలాగే ఒకరి స్పూర్తితో ఒకరు ఉన్నత శిఖరాలను అధిరోహి ంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాణావత్‌భీమ్లాల్ పాత్లావత్ కిరణ్ రాత్లావత్ చక్రి పాత్లావత్ దశరథం నేనావత్ శ్రీను భాణావత్ శ్రీరామ్ రమేష్ అభి శ్రీను రామ్ శ్రీరామ్ పాండు తదితరులుపాల్గొని మంజులకు అభినందనలు తెలిపారు.



## ఎస్సీ వర్గీకరణ నిలుపుదల చేయాలి

**మాలల ఆత్మగౌరవ సభకు నాగర్‌కర్నూల్ తరలిన మాలలు**

**నందిగామ, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ పిలుపుమేరకు హలో మాల చలో నాగర్‌కర్నూల్‌లో ఆదివారం జరిగిన మాలల ఆత్మగౌరవ సభకు నందిగామ నుంచి భారీ సంఖ్యలో మాలలు తరలివెళ్లారు. అంతకుముందు మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలలు ఏకుల వెంకటయ్య లింగం ప్రభయ్య ఏకుల జంగయ్య ఏకుల రవి గణేష్ పూర్ణం శ్రీకాంత్ సంపత్ ప్రబిస బాల్‌రాజ్ కరుణాకర్ శ్రీనివాస్ నర్సింగ్‌లతో పాటు భారీ సంఖ్యలో నాగర్‌కర్నూల్‌కు తరలివెళ్లారు.

## ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌గా చంద్రశేఖర్

**ఘట్‌కేసర్, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పురపాలక సంఘం కమీషనర్‌గా బి.చంద్రశేఖర్ నియమితులయ్యారు. 2023 జూలై నుంచి ఘట్‌కేసర్ మున్సిపల్ కమీషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండి.సాబేర్‌ఆలీ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఈమేరకు పురపాలక పరిపాలన, పట్టణాభివృద్దిశాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ కమీషనర్ల బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బి.చంద్రశేఖర్‌ను ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కమీషనర్‌గా బదిలీ చేయగా ఇక్కడి నుంచి సాబేర్ ఆలీని నిజాంపేట్‌కు బదిలీ చేశారు. ఈమేరకు సోమవారం కమీషనర్ సాబేర్ ఆలీ నూతన కమీషనర్ చంద్రశేఖర్‌కు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

## పోలీస్‌ఫ్లాగ్‌డే విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు వా ్యసరచన పోటీ నిర్వహిస్తున్న ఎస్ఐ నర్సింహ్మా

**ఘట్‌కేసర్, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** పోలీస్‌ఫ్లాగ్‌డే సందర్భంగా పోలీసులు కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఘట్‌కేసర్‌లోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో ఘట్‌కేసర్ ఎస్ఐ నర్సింహ్మా ఆధ్వర్యంలో విచక్షణతో కూడిన మొబైల్‌ఫోన్ వాడకం, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అనే రెండు అంశాలపై వ్యాసరచన నిర్వహించగా 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈపోటీలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో బహుమతులను ప్రధానం చేస్తామని ఆయన తెలిపారు.

## పద్మశాలి సంఘం నూతన అధ్యక్షునిగా కోట చందు



నూతనంగా ఎన్నుకోబడ్డ కమిటీ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

**కేశంపేట అక్టోబర్ 27, ప్రభాతవార్త :** కేశంపేట మండల కేంద్రంలో ఆదివారం నూతనంగా పద్మశాలి సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం అధ్యక్షుడు కోటచందు తెలిపారు. ఉపాధ్యక్షులుగా గంజి సుధాకర్, గంజి కృష్ణయ్య ప్రధాన కార్యదర్శులుగా నారని శ్రీనివాసులు కోటరాజులను ఏకగ్రీవం గా ఎన్నుకున్నట్లు కమిటీ అధ్యక్షుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంజి చంద్రయ్య బాలాజీ రమేష్ నారాయణ శ్రీకాంత్ ఉడత బాలకృష్ణ సామల అంజయ్య ఉప్పల చంద్రశేఖర్ పాలాది భాస్కర్ గడ్డమీది సాయికోట వెంకటేష్ సామల రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి: గోరేటి వెంకన్న



వివేకానంద విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న గోరేటి వెంకన్న

**పూడూరు, అక్టోబర్ 27, ప్రభాతవార్త ;** స్వామి వివేకానంద ఆశయ సాదనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్సీ,కవి,గాయకుడు గోరేటి వెంకన్న పేర్కొన్నారు. ఆదివారం పూడూరు మండలం పరిధిలోని కంకల్ గ్రామ పంచాయతీ ఆవరణలో శ్రీవీరభద్ర యువజన సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతుడు అయిన స్వామి వివేకానంద దేశ అభివృధి తోపాటు యువతలో స్ఫూర్తి నింపే విధంగా క్రమశిక్షణతో పని చేసి మంచి గుర్తింపు పొందారని వివరించారు. ప్రస్తుతం ఆయన విగ్రహాన్ని తన చేతులమీదుగా ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తానన్నారు. ప్రతి ఒక్కరు స్వామి వివేకానందను ఆదర్శప్రాయంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం తన పాటలతో పలువురిని ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పూడుగుర్తి మల్లేశం, వివిధ పార్టీల నాయకులు అన్వర్, మంచనపల్లి వీరేశం, రవిందర్, నర్సింలు, శ్రీవీరభద్ర యువజన సంఘం అధ్యక్షులు రఘుపంతులు, ప్రధాన కార్యదర్శి, సంతోష్ కుమార్, స్వామి వివేకానంద విగ్రహదాత శైలజా నాగేశ్వరరావు, రఘుపంతులు, సూర్యనారాయణ, భాస్కర్‌రెడ్డి, బాషుమియా, బుచ్చిబాబు, వివిధ గ్రామాలకు చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొని కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం .. నిలిచిపోయిన చెత్త సేకరణ.. దుర్గదం

**మేడ్చల్, అక్టోబర్ 27. ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలోని నూతన్‌కల్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం వల్ల ఇంటింటి చెత్త సేకరణ నిలిచిపోవడంతో దుర్గంధంగా మారిందని ఆ గ్రామానికి చెందిన ఓబిసి మండల కన్వీనర్ మాసాని యాదగిరి ముదిరాజ్ ఆరోపించాడు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ నూతన్‌కల్ గ్రామంలో గత మూడు రోజులుగా చెత్త సేకరించే ట్రాక్టర్ కదలక ఇంటింటా చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పుడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కర్యాదర్శి ఉమాదేవిని అడుగగా ట్రాక్టర్ డిజిల్‌కు డబ్బులు లేవని చెబు తున్నారని పేర్కొన్నాడు. గ్రామ పంచాయతీలో నిధులు సుమారుగా రూ 1 కోటి వరకు ఉన్నా డిజిల్ పోయించలేని దుస్థితి రావడం దారుణమని అన్నా డు. ఈ విషయమై ఉన్నతాది కారులకు ఫిర్యాదు చేస్తానని ఆయన ఆరోపించాడు.



నూతన్‌కల్‌లో డిజిల్ లేక నిలిచిఉన్న పంచాయతీ చెత్త సేకరణ ట్రాక్టర్

## విద్యార్థి దశ ఉన్నతమైంది

**పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు**

**పూడూరు, అక్టోబర్ 27, ప్రభాతవార్త ;** విద్యార్థి దశ ఉన్నతమైందని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా పూడూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 2022-23 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మండల పరిధిలోని కొత్తపల్లి వ్యవసాయ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యంలో విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగితే ఏరంగంలోనైనా రానించగలిగే అవకావం ఉంటుందని గుర్తుచేశారు. ప్రస్తుతం తమతోపాటు వివిధ రంగాల్లో గుర్తింపు తెచ్చుకొని స్థిరపడ్డ తమ శిష్యులందరికి ఎల్లప్పుడూ తమ ఆశీర్వాదాలు ఉంటాయని వివరించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకొని తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు పూర్వవిద్యార్థులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పలువురు విద్యార్థులు ఆటపాటలతో ఉత్సాహ పరిచిన ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు అష్టావధాని మల్లఅంజయ్య, ఎం వెంకట్‌రెడ్డి, జి వెంకట్‌రెడ్డి, కిషన్, సాయన్న, అబ్దుల్ రహూఫ్, నర్సి రెడ్డి, నళిని, లక్ష్మీనర్స మ్మ, తదితరులు పాల్గొన్నారు.



పూడూరు జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తమ గురువులను సన్మానిస్తున్న దృశ్యం

# చేతి వృత్తులను ప్రోత్సహించేందుకే విశ్వకర్మయోజన

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ముషీరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** కాలక్రమేణా కనుమరుగవుతున్న చేతి వృత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, అందుకే ప్రధాని మోదీ విశ్వకర్మయోజన పేరుతో చేతివృత్తులను ప్రోత్సహిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కవాడిగూడలోని దోభీఘాట్‌లో 26 లక్షల పార్లమెంట్ నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్‌కు ఆయన స్థానిక కార్పొరేటర్ రచనశ్రీతోకలసి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మయోజన ద్వారా కోట్లాది మందికి నైపుణ్య శిక్షణ, పరికరాలు, ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో అనేక సంవత్సరాలుగా దోభీఘాట్లు ఏర్పాటు చేయటం, దోభీఘాట్ల వద్ద మౌలిక వసతులు కల్పించటం చేస్తున్నానని, అందులో భాగంగా ట్యాంక్‌బండ్ కింద రజక సంఘం ఆధ్వర్యంలో ఉన్న దోభీఘాట్‌లో కమ్యూనిటీ హాల్, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. చేతి వృత్తులు చేసుకునే వారికి మోదీ ప్రభుత్వం అండగా ఉంటుందని, రాబోయే రోజుల్లో వేలాది మందికి నైపుణ్య శిక్షణ, పరికరాలు అందించటమే కాకుండా ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు నరసింహ, బీజేపీ నాయకులు పూసరాజు, రమేష్‌రాం, వెంకటేష్, సలంద్రి శ్రీనివాసయాదవ్, కవాడిగూడ అధ్యక్ష కార్యదర్శులు మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, పరిమళ కుమార్, బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షులు వల్లాల శ్యాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీహాల్ పనులను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలి

**సైఫాబాద్, అక్టోబరు 27 ప్రభాతవార్త:** దేశంలో అవినీతి, అక్రమాలు అంతం కావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందిగా అమలు చేయాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్‌ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆర్టీఐ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్‌లు లేక వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో అవినీతి, అక్రమాలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిన రోజును, పరిరక్షణ కమిటీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమాచార హక్కు చట్టంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సుకు పరిరక్షణ కమిటీ జాతీయ ప్రధానకార్యదర్శి చంటి ముదిరాజ్ అధ్యక్షత వహించారు. శ్రీనివాస్‌ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం దినోత్సవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీఐ కార్యాలయంలో తక్షణమే కమిషనర్లను నియమించాలని డిమాండ్‌చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని, వేలాది మంది కార్యకర్తలతో ఆర్టీఐ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంటిముదిరాజ్ మాట్లాడుతూ ప్రజలచేత ఎన్నుకోబడిన రాజకీయ నాయకులను వారి సంపదను సమాచార హక్కు చట్టం పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కమిటీ మహిళా అధ్యక్షురాలు సూర శ్రవంతి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లం వెంకటేశం, కార్యదర్శి గుండెల రాయుడు, సినిమా హీరో కిరణ్, ఫిలిం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీవీఆర్, బిజెవైఎం నాయకుడు చింతల రాఘవేందర్ ముది రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రుల్లో భద్రత డొల్ల !

* ఇరుకు గదుల్లో పలు ప్రైవేట్ దవాఖానాలు
* ఇష్టారాజ్యంగా వైద్య చికిత్సలు
* తనిఖీలను విస్మరించిన అధికారులు
* నిబంధనలకు విరుద్ధంగా భవనాలు




**హైదరాబాద్, అక్టోబరు 27 ప్రభాతవార్త** వైద్యరంగం వ్యాపారంగా మారింది. కార్పొరేట్, మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ పేర్లతో ప్రైవేటు ఆసుపత్రులు వెలుస్తున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘించి తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నప్పటికీ సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నగరంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రిలో రోగుల భద్రత ప్రశ్నార్థకమే అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాది క్రితం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చేపట్టిన తనిఖీల్లో మెజారిటీ ఆస్పత్రిలో అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం వసతులు లేవని తనిఖీ బృందాలు గుర్తించి నోటీసులు జారీ చేశాయి. ఆ తర్వాత రాజకీయ జోక్యం కారణంగా ఆయా ఆస్పత్రులపై చర్యలు నిలిచిపోయాయి.

### అల్లోపతి వైద్యులుగా చలామణి...

హైదరాబాద్ జిల్లా పరిధిలో ప్రభుత్వ గుర్తింపు ఆస్పత్రులు 2,500 ఉండగా, 241 ఆస్పత్రులకు ఎలాంటి గుర్తింపులేదు. వీటికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నోటీసులు సైతం జారీ చేశారు. రంగారెడ్డి జిల్లాలో సుమారు 2700 ప్రైవేట్ దవాఖానాలు ఉండగా, వీటిలో 600కు పైగా ఆస్పత్రులకు ఎటువంటి గుర్తింపు లేదు. ఇరుకు గదులు, అపార్ట్‌మెంట్లలోని ప్లాట్లను అద్దెకుతీసుకుని యాజమాన్యాలు ఆస్పత్రులను నిర్వహిస్తున్నాయి. కొన్ని ఆస్పత్రులు ఆయుర్వేద వైద్యులు, ఆర్ఎంపీల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. ఎమర్జెన్సీ విభాగాల్లో మెజార్టీ వైద్యులు ఆయుర్వేద వైద్యులే. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తనిఖీల్లోనూ ఇదే అంశం బయటపడింది. తక్కువ వేతనాలకు పని చేస్తుండటంతో యాజమాన్యాలు కూడా వీరితోనే కాలం వెళ్లదీస్తున్నాయి. అధికారులు తాత్కాలికంగా తనిఖీలు చేయడం, వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిపాటిగా మారింది.

### మార్గదర్శకాలపై పట్టింపేదీ ?

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం ప్రతీ ఆస్పత్రికి ఫైర్ సేఫ్టీ అనుమతి తప్పనిసరి, ఆస్పత్రి ఆవరణలో ఫైర్ ఇంజిన్ చుట్టూ తిరిగే విధంగా రోడ్డు ఉండాలి. బహుళ అంతస్తుల భవనం ఎత్తును బట్టి రెండు గేట్లను ఏర్పాటు చేయాలి. ఏటా మాక్ డ్రిల్ నిర్వహించి ఆస్పత్రి సిబ్బందికి ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించాలి. ఆస్పత్రి యాజమాన్యం ఒక్క బెడ్‌తో చికిత్స అందించినా.. ఆ భవనానికి అగ్నిమాపక శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. క్లీనికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం అగ్నిమాపక శాఖ అధికారులు ఆస్పత్రిని తనిఖీ చేసి అన్ని సవ్యంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తరువాతే నిరభ్యంతర పత్రం(ఎన్‌ఓసీ) జారీ చేయాలి. కానీ జిల్లాలో ఏ ఒక్క ఆస్పత్రి కూడా నిబంధనల మేరకు లేదు. అగ్నిమాపక శాఖ అధికారులు మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా ఎన్‌ఓసీలు జారీ చేస్తున్నారు.

### ఎన్‌ఒసి తప్పనిసరి...

15 మీటర్ల కన్నా ఎక్కువ ఎత్తులో భవనం ఉంటే విధిగా జీహెచ్‌ఎంసీ, ఆయా మున్సిపాలిటీల నుంచి భవన నిర్మాణ అనుమతులతో పాటు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందాలి. అగ్నిమాపకశాఖ నుంచి ఎన్‌ఓసి తీసుకోవాలి. కోట్లాది రూపాయలు వెచ్చించి భవనాలు నిర్మిస్తున్న ఆస్పత్రులు ప్రమాదాల నియంత్రణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.

### నిర్వహణ గాలికి...

ప్రతి గదిలోకి వెలుతురు ఉండేలా ఆస్పత్రిని నిర్మించాలి. ప్రమాదాలు నివారించే అన్ని ఉపకరణాలు కొనుగోలు చేయాలి. ఆపత్కాలంలో రోగులు త్వరగా బయటపడేందుకు అనువైన మెట్లు, లిఫ్ట్‌లు ఉండాలి. ఆటోమెటిక్ స్ప్రింక్లర్స్ సిస్టం, స్మోక్ డిటెక్షన్, వైట్ రైర్, మాన్యువల్ ఆపరేటింగ్ అలారం, టెర్రస్ ట్యాంక్, అండర్ గ్రౌండ్ వాటర్ స్టోరేజీ ట్యాంక్, ఎలక్ట్రికల్ జాకీ పంపులు అందుబాటులో ఉంచాలి. కానీ మెజార్టీ ఆస్పత్రిలు వీటిని ఏర్పాటు చేయడంలేదు. సమకూర్చిన ఆస్పత్రిలు కూడా ఆ తర్వాత నిర్వహణ గాలికొదిలేస్తున్నాయి.

### మ్యాక్‌డ్రిల్ చేయించాలి...

మూడు నెలలకోసారి అగ్నిమాపక సిబ్బంది సహాయంతో ఆస్పత్రిలో ఎనాక్యుయేషన్ డ్రిల్ (ప్రమాదం జరిగినప్పుడు రోగులను బయటికి తరలించే ప్రక్రియ) నిర్వహించాలి. వంటగది, క్యాంటిన్, ఆస్పత్రి భవనంలో కాకుండా వేరేచోట ఏర్పాటుచేయాలి. కానీ మెజార్టీ ఆస్పత్రిలు సెల్లార్లలోనే వంటగదులు, ఇన్‌పేషంట్ ఫార్మసీ గోదాంలు, క్యాంటిన్ సహా కీలకమైన డయాగ్నోస్టిక్ (ఎక్స్‌రే, సీటీ, ఎంఆర్ఐ, రక్తనిధి కేంద్రం, రక్త, మూత్ర పరీక్షలకు సంబంధించిన ల్యాబ్) సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాయి.

భవనంలో అంతస్తుల వారీగా కంపార్ట్‌మెంట్స్ ఏర్పాటు చేసి, ఒక బ్లాక్ నుంచి మరో బ్లాక్‌కు మంటలు వ్యాపించకుండా చూడాలి. ఆస్పత్రిలో వాడే గ్యాస్ నిల్వ చేయడంలో జాగ్రత్త వహించాలి. అత్యవసర ద్వారాలను తాళాలు వేయకూడదు. బయటికి వెళ్లే మార్గాలపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఫర్నిచర్, ఇతర వ్యర్థాలను ఆస్పత్రి ఆవరణలో నిల్వ చేయకూడదు. ఎలక్ట్రికల్, ఏసీ, ఇతర విద్యుత్ ఉపకరణాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.







## ఘనంగా సదర్ ఉత్సవాలు

**హైదరాబాద్, అక్టోబరు 27 ప్రభాతవార్త** నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం సదర్ ఉత్సవాలు ప్రారంభించారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందంగా అలంకరించిన దున్నపోతుల విన్యాసాలు, యాదవుల నృత్యాలతో, బ్యాండ్‌మేళాలతో ధర్నాచౌక్ దద్దరిల్లింది. ఈ ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఏపీ మాజీ పీసీసీ అధ్యక్షులు ఎస్.రఘువీరారెడ్డి, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, కాంగ్రెస్ సీనియర్‌నేత మైనంపల్లి హనుమంతరావు, మాజీ మంత్రి కృష్ణయాదవ్, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, నటుడు రాహుల్ సిప్లిగంజ్ భారీగా ప్రజలు హాజరయ్యారు. ఎంపి అనిల్‌కుమార్ యాదవ్ కోరిక మేరకు వేదికపై సిఎం రేవంత్‌రెడ్డి స్టెప్పులేశారు.

# 'టెక్నాలజీ టెక్నిక్, ట్రైబలజీ'లపై ఆర్థోపెడిక్ సర్జన్‌ల సదస్సు




టెక్నాలజీ టెక్నిక్, ట్రైబలజీ అంశాలపై సదస్సు నిర్వహించిన దృశ్యం

**హైదరాబాద్ అక్టోబరు 27 ప్రభాతవార్త:** టెక్నాలజీ టెక్నిక్, ట్రైబలజీ అంశాలపై ఆర్థోపెడిక్ సర్జన్‌లకు అవగాహన కల్పిస్తూ రెండు రోజుల సదస్సు ఆదివారం బంజారాహిల్స్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో జరిగింది. ఇదే సందర్భంగా ప్లస్ ఆర్థోపెడిక్, ప్లస్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జాయింట్ రీప్లేస్‌మెంట్‌లో ప్రస్తుతం ఉన్న కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీ, ఆధునిక ఇంప్లాట్స్ అనే అంశంపై సదస్సులో చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, కిమ్స్, సన్‌షైన్ హాస్పిటల్ ఎండి డాక్టర్ ఎవి.గురువారెడ్డి, చెన్నై సిన్స్ హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జన్ పి.సూర్య నారాయణ సదస్సును ప్రారంభించారు. సదస్సులో జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సలో సిరామిక్ ఇంప్లాంట్స్ ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలు, సిరామిక్ ఇంప్లాంట్స్ ఉపయోగించడం వల్ల రోగికి ఇన్‌ఫెక్షన్‌లు తగ్గడం, పాలివెర్ తగ్గి ఇంప్లాంట్ లైఫ్‌టైమ్ పెరగడం వంటి ఎన్నో ఉపయోగాలున్నానే విషయాలను వివరించారు. విదేశాల నుంచి ఫ్యాకల్టీలు, జర్మనికి చెందిన వాగ్నర్, స్విట్జర్‌లాండ్‌కు చెందిన మార్టిన్ జిమర్మన్న, మలేషియా కుచెందిన ఇజాన్ ఇంబ్రహీం, శ్రీలంకకు చెందిన డాక్టర్ చందన పాల్గొని ఇంప్లాంట్ టెక్నాలజీలో వస్తున్న మార్పులు, ప్రయోజనాలు వాటి ఉపయోగించి శస్త్ర చికిత్సలు చేయడం వల్ల రోగికి కలిగే లాభాలు వివరించారు. గురువారెడ్డి మాట్లాడుతూ యువ డాక్టర్లు ఒపిడికి వచ్చే రోగుల సమస్యలను ఖచ్చితంగా తెలుసుకుని మెరుగైన చికిత్స అందించాలన్నారు. ఆర్థోపెడిక్ సర్జన్‌లు డాక్టర్ అఖిల్ దాడి, డాక్టర్ అవతార్ సింగ్‌లు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆర్థోపెడిక్ సర్జన్‌లు చేసిన ప్రెజెంటేషన్‌లపై సదస్సులో చర్చించి రోగికి మరింత మెరుగైన విధంగా చికిత్సలు ఎలాచేయాలనే అంశాలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. దాదాపు వందమందికిపైగా ఆర్థోపెడిక్ సర్జన్‌లు పాల్గొన్నారు.

## తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం

**నిజాంపేట, అక్టోబరు 27 ప్రభాతార్త :** హైదరాబాద్‌లో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ జనరల్‌బాడీ సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో వివిధజిల్లాలకు సంబంధించిన సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగినటువంటి కార్యక్రమంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జగన్మోహన్ వ్యవహరించగా ఇండియన్ ఒలింపిక్ సంఘం ఎకెఎఫ్ఐ సభ్యులు అబ్జర్వవర్‌లుగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా కాసాని వీరేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్‌రెడ్డి, కోశాధికారిగా రవి, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షునిగా ఎన్నుకోవడిన కాసాని వీరేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ తనను అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆటోను ఢీకొట్టిన కారు

## ముగ్గురికి స్వల్ప గాయాలు

**గచ్చిబౌలి, అక్టోబరు 27 ప్రభాతవార్త :** గచ్చిబౌలిలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. అతివేగంగా దూసుకు వచ్చిన కారు బస్సును ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించి ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. అనంతరం డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టడంతో కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... రాజేంద్రనగర్ అసద్‌నగర్‌కు చెందిన ఇస్మాయిల్(40) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఆదివారం ఉదయం ఆటో (టిఎస్12 యుఈ0308)లో ఇద్దరు ప్రయాణికులను తీసుకొని మణికొండ నుంచి లింగంపల్లికి బయలుదేరాడు. మరమధ్యలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రధాన ద్వారం ముందుకు వచ్చిన తరువాత వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఇస్మాయిల్ ఆటోను ఢీకొట్టింది. రాహుల్, శ్రీకాంత్‌రెడ్డి, సందీప్, మరో వ్యక్తి కలిసి నలుగురు కారులో (టిఎస్34 ఎఫ్3881)లో గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వస్తూ హెచ్‌సియు గేటు ముందున్న బస్సును ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించి ఆటోను ఢీకొట్టారు. అనంతరం ఢివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా, ఆటో ధ్వంసమైంది. మరోవవైపు కారులో మద్యం సీసాలు లభించడంతో మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదం చోటుచేసుకుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని కారులో ఉన్న వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఇంటినుంచి వెళ్లిన ఆటోడ్రైవర్ మృతి

**ముషీరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** ఇంటి నుండి వెళ్లిపోయిన ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గాంధీనగర్ సీఐ రాజు కథనం ప్రకారం...బోయినపల్లిలో నివసించే కిరణ్ కుమార్ ఆటో నడుపుతూ ఉండేవాడు. కొంత కాలం నుండి మధుమేహం వ్యాధితో బాధపడుతున్న కిరణ్‌కుమార్ కాలుకు ఇన్‌ఫెక్షన్ రావటంతో కాలు తీసివేశారు. కాలు తీసివేయటంతో మానసికంగా కృంగిపోయిన కిరణ్ మద్యానికి బానిసై భార్య రజితతో తరచుగా గొడవ పడుతూ ఉండేవాడు. ఈనెల 23న భార్యతో గొడవపడి ఇంటి నుండి వెళ్లిపోయిన కిరణ్ తిరిగి ఇంటికి రాలేదు. భర్త ఆచూకీ తెలియకపోవటంతో బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో రజిత ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీరా వద్ద ఆటోలో కిరణ్‌కుమార్ మృతి చెంది ఉన్నాడు. భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. కిరణ్‌కుమార్ మృతికి హార్ట్‌ఎటాక్ కారణం కావచ్చని భావిస్తున్నారు.

## గంజాయి సేవిస్తున్న ముగ్గురు కూలీలు అరెస్ట్

**మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబరు 27 ప్రభాతవార్త :** గుట్టుచప్పుడు కాకుండ గంజాయి వినియోగిస్తున్న ముగ్గురు కూలీలను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారినుంచి 200 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల కథనం ప్రకారం...పాతబస్తీ బహదూర్‌పుర ప్రాంతానికి చెందిన షేక్ ముశ్రఫ్ యాసిన్ (23) వృత్తి రీత్యా క్యాటరింగ్. ఝార్ఖాండ్‌కు చెందిన ఇజ్రాయిల్ అన్సారి (20) కాటేదన్‌లో నివాసం ఉంటున్నాడు. మహారాష్ట్ర నివాసి మంజార్ మహఫూజ్ సయ్యద్ (35) బాలాపూర్‌లో ఉంటున్నాడు. ఈ ముగ్గురు కలిసి లేబర్‌గా పనిచేస్తున్నారు. కాటేదన్‌లో గుట్టుచప్పుడుకాకుండ ముగ్గురు కూలీలు కలిసి గంజాయిని వినియోగిస్తున్నట్లు సమాచారం అందటంలో రాజేంద్రనగర్ ఎస్‌ఓటి పోలీసులు, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కలిసి ఆదివారం తెల్లవార జామున దాడి చేశారు. ముగ్గురు కూలీలను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారినుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చార్మినార్ శ్రీభాగ్యలక్ష్మి మందిరం ట్రస్టీ శశికళ

### దీపావళి మహోత్సవాలకు రావాలంటూ

# సిఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

**చార్మినార్, అక్టోబరు 27 ప్రభాతవార్త :** చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో ఎంతో వైభవంగా జరగనున్న దీపావళీ మహోత్సవాలలో పాల్గొనాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి మందిరం ట్రస్టీ శశికళ ఆహ్వాన పత్రిక అందజేశారు. చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరం ట్రస్టీ శశికళతో పాటు పలువురు ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న దీపావళీ మహోత్సవాలలో పాల్గొనాలని కోరుతూ వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దీపావళీ మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మందిరం ట్రస్టీ శశికళ మాట్లాడుతూ భక్తులకు అమ్మవారి ఖజానాను 31వ తేదీన పంపిణీ చేయనున్నామని తెలిపారు.

### నేడు సెట్విన్ కార్యాలయాన్ని సందర్శించనున్న

## బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**చార్మినార్, అక్టోబరు 27 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ దారుషిఫా పురానీహవేలీలో ఉన్న సెట్విన్ ప్రధాన కార్యాలయాన్ని ఈ నెల 28వ తేదీన రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించనున్నారు. సెట్విన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఉదయం 11.30 గంటలు జరిగే సమావేశంలో సెట్విన్‌కు సంబంధించిన కార్యక్రమాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించనున్నారు. సమావేశంలో సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిదర్ రెడ్డితో పాటు పలువురు సెట్విన్ అధికారులు పాల్గొంటున్నారు.

# కూరగాయల మార్కెట్‌తో వాహనదారుల ఇక్కట్లు

## బ్రిడ్జికి ఇరువైపులా షాపుల ఏర్పాటుతో ట్రాఫిక్ జాం



ఫతేనగర్ లింక్ రోడ్డుపై ఆదివారం మార్కెట్‌తో ట్రాఫిక్ జాం అయిన దృశ్యం

**బేగంపేట అక్టోబరు 27, ప్రభాతవార్త** బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో ఆదివారం వచ్చిందంటే చాలు వాహనదారులకు అగచాట్లు తప్పడం లేదు. బస్తీకి ఆనుకుని ఉన్న ఫతేనగర్ లింక్ రోడ్డుతో పాటు బస్తీ రోడ్లను సైతం ఆక్రమించి చిరు వ్యాపారులు ఆదివారం కూరగాయాల మార్కెట్ ఏర్పాటు చేస్తుండటంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ జాం అవుతుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీతో పాటు వడ్డెర బస్తీ, బ్రాహ్మణవాడీ, మాతాజీనగర్ తదితర బస్తీల ప్రజలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో ట్రాఫిక్‌జాం అవుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు..

ఇదే ప్రాంతంలో రెండు ఆలయాలు ఉండటంతో భక్తులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. దీంతోపాటు మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్ (పంజా గుట్ట) వద్ద ప్రారంభమైన ప్లై ఓవర్ బేగంపేట శ్రీకట్ట మైసమ్మ మహలక్ష్మి అమ్మ వారి ఆలయం వద్ద కిందికి దిగుతుంది. దీంతో రాజ్‌భవన్, అమీర్‌పేట తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ఇక్కడ కిందికి దిగి ఫతేనగర్ బ్రిడ్జిపై నుంచి సనత్‌నగర్, బాలానగర్, కూకట్ పల్లి తదితర ప్రాంతాలకు వెళుతుంటాయి. ఇదే ప్రాంతంలో అటు ఫతేనగర్ నుంచి వచ్చే వాహనాలు, ఇటు సికింద్రాబాద్ నుంచి వచ్చే వాహనాలతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. ఫతేనగర్ బ్రిడ్జి పైన కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేసుకునే వ్యాపారులు రోజు రోజుకు బ్రిడ్జికి రెండు వైపులా దుకాణాలు ఏర్పాటు చేస్తుండటం, వారి వద్ద కొనేందుకు వచ్చిన వారు అక్కడే నిలబడి కొనుగోలు చేస్తుండటంతో వాహనదారుల రాకపోకలకు అంతరాయంగా మారుతుందని వాహనదారులు, పై బస్తీల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా కూరగాయాలు తీసుకుని వచ్చిన వాహనాలను సైతం దుకాణదారులు అక్కడే పార్కింగ్ చేస్తుండటంతో మరింత ఇబ్బందిగా మారుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇక సోమవారం మొదలు కొని ఆదివారం వరకు ఈ రోడ్డులో బేగంపేట బస్తీ ని ఆను కుని ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలకు వచ్చే విద్యార్థినీ, విద్యార్థులకు సంబంధించిన వాహనా లను సైతం ఈ బ్రిడ్జిని కబ్జా చేయడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా వాహనాలను నిలిపి ఉంచుతుండటం తమకు ట్రాఫిక్ ఇబ్బందులు తెచ్చిపెడుతుందని పై బస్తీల వాసులు ఆరోపిస్తున్నారు. ఈ పాఠశాలకు పార్కింగ్ ఉన్నా వాహనాలను లోపలికి అనుమతించక పోవడంతోనే పాఠశాలకు వచ్చే విద్యార్థుల వాహనాలను రోడ్లపైన పార్కింగ్ చేసి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఫతేనగర్ బ్రిడ్జిపైన నోపార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసినా వాహనదారులు మాత్రం బ్రిడ్జిపైన రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారని, అలాగే బ్రిడ్జి కింద పార్కింగ్ చేస్తున్నారని, ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని, తమకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని పై బస్తీల ప్రజలు కోరుతున్నారు. మార్కెట్ లో జేబు దొంగలు, మొబైల్ దొంగలు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారని, గతంలో పలుమార్లు బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో కూరగాయాలు కొనేందుకు వెళ్లిన సమయంలో తమ మొబైల్స్ పొగొట్టుకున్నట్లు ఫిర్యాదులు కూడా చేసినట్లు ప్రజలు ఆరోపించారు. మార్కెట్ జరుగుతున్న రోజు ఈ ప్రాంతంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.